honeybee.org
Vol-12 Issue-6
వెల : రూ. 20/-
సంపుటి 12 సంచిక 6 నవంబర్ - డిశంబర్ 2024

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక











# 'పల్లెసృజన'కు యునైటెడ్ వే, హైదరాబాద్ వారి ఆహ్వానం
















11 డిసెంబర్, 2024న హైదరాబాద్, బంజారా హిల్స్ లోని ప్రముఖ తాజ్ కృష్ణ హొటల్ లో 'యునైటెడ్ వే, హఐదరాబాద్' వారి ఆధ్వర్యంలో "న్యూ జెర్సీ ఇండియా కమిషన్" వారు నిర్వహించిన కార్యక్రమానికి 'పల్లెసృజన' సంస్థను ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లెసృజన తరుపున ఇద్దరు ఇన్నోవేటర్లు "కడివెండి మహిపాల్ చారి, నన్నం తిరుపతి"లు వాలంటీర్స్ రాజేశ్వర రావు, శివ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సందర్శకులకు 15 ఇన్నోవేషన్లను ప్రదర్శించి, వాటిని తయారు చేసిన ఇన్నోవేటర్లను, వాటి పని తీరును వివరించారు. అమెరికా న్యూజెర్సీలోని పెద్ద పెద్ద సస్థలు భారతదేశంలో చేస్తున్న వ్యాపారంలో భాగంగా 'సిఎస్ఆర్ ఫండ్' లో కొంత మొత్తాన్ని యునైటెడ్ వే హైదరాబాద్ వారి ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వినియోగించాలని నిర్ణయించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. యునైటెడ్ వే హైదరాబాద్ వారు అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. వారి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆ సంస్థ 'పల్లెసృజన' వారు చేస్తున్న కార్యక్రమాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకొని గ్రామీణ శాస్త్రవేత్తలను గౌరవించి, వారి ఇన్నోవేషన్‌లను సమాజానికి అందించడంలో తోడ్పడు తున్నందుకు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కలిగింది పల్లెసృజనకు.

రాబోయే కాలంలో యునైటెడ్ వే హైదరాబాద్ వారి ద్వారా పల్లెసృజన గ్రామీణ ఆవిష్కరణలు సమాజానికి మరిన్ని అందుతాయని ఆశిస్తోంది పల్లెసృజన. సాయత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' గ్రామీణ ఆవిష్కరణల పట్ల ఆ సంస్థల ప్రతినిధులు చాలా ఆసక్తిని చూపించి, మన ఇన్నోవేటర్లను అభినందించడం 'పల్లెసృజన' కుటుంబానికి ఎంతో సంతోషకరమైన విషయం. -ఎడిటర్

సంపుటి-12 సంచిక - 6 నవంబర్ - డిశంబర్ 2024

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-49253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 200/-**
**for 1 year Subscription**

## ఈ సంచికలో.....

* రైతు శ్రమను తగ్గించే 'కృషి మిత్ర' సంచి సత్యనారాయణ చిన్న ఆలోచన - 5
* అమరేంద్ర చక్కటి ఇన్నోవేషన్‌తో వాక్కాయల కోత ఎంతో సులభం - 7
* ప్రకృతి ఆశీర్వాదాలను సమాజానికి అందిస్తున్న 'ఆకుల' రామారావు - 10
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 11
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 14
* యువత అవగాహనకై పకృతిలో లభించే చెట్ల పేర్లు సంస్కృతం మరియు తెలుగు భాషల్లో - 18
* '49వ జాతీయ శోధయాత్ర - తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం - మొదటి భాగం - 20
* 'అడవి పుత్రుడు' కొమెర జాజికి దక్కిన అరుదైన గౌరవం - 22
* పల్లె జ్ఞానం - 23
* మీ సమస్యకు మా పరిష్కారం పరిధిలో చెఱకు రైతు పెట్టుబడి ఆదా చేసిన అల్లాడి ప్రభాకర్ "చెఱకు కత్తిరించే యంత్రం" - 25
* ఎన్ఐఎఫ్ వారి 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్-2023) పురస్కారాలు - 28
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 32

**కవర్ లోపలి పేజీలో ...**
'పల్లెసృజన'కు "యునైటెడ్ వే, హైదరాబాద్" వారి ఆహ్వానం
**మధ్య పేజీలో :**
నవంబర్-డిశంబర్ 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల గుర్తింపుకై "పల్లెసృజన" కృషి

ఆవిర్భవిస్తున్న పల్లెసృజన ప్రథమ దశాబ్దంలో ( 2005-2015) గ్రాస్‌రూట్స్ (ప్రునాది స్థాయి) ఆవిష్కరణలు ఇన్నోవేటర్లను సమాజం గుర్తించడానికి, ప్రోత్సహించడానికి ముందుకు రాలేదు. ఈ ఇన్నోవేషన్లు శాస్త్రీయం కావని, ఉత్పత్తి చేయడానికి ఆర్హ్మలు కారని అభిప్రాయ పడింది. కొన్ని ఇన్నోవేషన్లను గుర్తించినా, వాటి విస్తరణకు ముందుకు రావడానికి సమాజం సంకోచించింది. ప్రభుత్వం విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, మీడియా, రాజకీయ నాయకులు అంతా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లపై సుముఖత చూపించలేదు. పల్లెసృజన సంస్థ అంతర్గత చర్చల్లో పైన చెప్పిన సమాజ వైఖరిని మార్చాలంటే ఏం చేయాలన్నది ప్రాధాన్యత సంతరించుకున్నది. గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రాముఖ్యత, వాటి అస్తిత్వం, అవి రావటం వల్ల సమాజానికి చేకూరే లాభాలు, వాతావరణ రక్షణకు తోడు, జీవన విధానంలో మంచి మార్పులు, తక్కువ ఖర్చుతో లాభాన్ని పొందే అవకాశాలు, గ్రామ ప్రజల కష్టాల తగ్గింపు, సమయం ఆదా, శారీరక శక్తి ఉపయోగించడంలో సుఖం, పెట్టుబడుల తగ్గింపు, మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధి పథం, యువకులకు స్ఫూర్తి.... ఇలాంటి సుఫలితాలు ఇచ్చే గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను వ్యవస్థ గుర్తింపుకై తీవ్ర ప్రయత్నం చేయాలని 'పల్లెసృజన' నిర్ణయించింది. వ్యవస్థకు అర్థమయ్యే భాషలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను చూపెట్టాలని నిర్ణయించడం జరిగింది. ప్రధానంగా అవార్డులు, పేటెంట్లు సాధించాలన్న కార్యాన్ని చేపట్టింది.

వాలంటీర్ల సహకారంతో వెతికి వెలికి తీసిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ అవార్డులకై ప్రతిపాదించడం ప్రారంభించాం. ఇన్నోవేషన్ల ప్రభావం సమాజంపై ఎంతగా ఉన్నదో సత్యపూర్వకంగా వివరించడానికి ప్రయత్నించాం. మాకు ఆశ్చర్యం కల్గించింది ఏమిటంటే ఏ వ్యవస్థ అయితే గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు సుముఖత చూపలేదో అదే వ్యవస్థ వీటిని గుర్తించడానికి తడబడలేదు. రాష్ట్రపతి పురస్కారాలు, జాతీయ పురస్కారాలు మన తెలుగు ఇన్నోవేటర్లు అందుకోవడం ప్రారంభమైంది. రెండేళ్ళలో స్థానిక, ప్రాంతీయ , రాష్ట్ర స్థాయి పురస్కారాలు, సత్కారాలు మెల్లమెల్లగా ఈ ఇన్నోవేటర్లను వరించడం ప్రారంభమైంది. పల్లెసృజన ఆనందానికి అవధులు లేవు. ఇనుమడించిన ఉత్సాహంతో పల్లెసృజన వాలంటీర్లు మరిన్ని అవార్డులకై నామినేషన్ చేయడం జరిగింది. దీన్ని ఒక సానుకూల వలయం లాగా భావించాం.

'పల్లెసృజన' ద్వైమాసిక పత్రిక ద్వారా ఇన్నోవేషన్ల వివరాలు, గెలుచుకున్న గుర్తింపులు సమాజంలో విస్తృతం చేయగలిగాం. ఇన్నోవేషన్ల ప్రదర్శనలు, పల్లెసృజన చేసే ఉపన్యాసాలు, చర్చల్లో వాటిని భాగంగా చేశాం.

ఇన్నోవేషన్లు విస్తృతమే కాకుండా వాటి గుర్తింపును సమాజం గమనించడం ప్రారంభించి, స్థానికంగా వారికి సత్కారాలు, గుర్తింపులు, జిల్లా స్థాయిలో స్థానిక అధికారులు వీరిని గుర్తించడం..... ఇలా గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను సమ్మతించడం, ఆహ్వానించడం, గౌరవించడం తెలుగు రాష్ట్రాల్లో జరిగింది. పల్లెసృజన ప్రయత్నంఫలించింది.

మరో పథం ఈ దిశగా పల్లెసృజన చేపట్టింది - ఇన్నోవేషన్లకు 'పేటెంట్' (మేధో హక్కులు) ఇప్పించాలన్న ఉద్దేశ్యంతో వాలంటీర్లను ప్రోత్సహించడం. ఇన్నోవేషన్లను గ్రంథస్థం చేయడం, అందునా సాంకేతిక పరంగా పేటెంటు అధికారులకు సమ్మతంగా ఉండేలా చేయడం, కొంత కష్టమైనా వాలంటీర్లు స్వయంగా నేర్చుకుని పేటెంట్లకై ఇన్నోవేటర్ల పేరుమీద దరఖాస్తు చేశారు. వాలంటీరు పేటెంటు లాయర్లు, నేషనల్ ఇన్నోవేషన్‌ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) పల్లెసృజనకు ఎంతో సహకారం చేశారు.



పల్లెసృజన ఈ గుర్తింపు కార్యక్రమాలను సాగిస్తూనే ఉంది. 2024వ సంవత్సరంలో పల్లెసృజన వాలంటీర్ల సహకారం, నిష్ఠతో మరిన్ని సత్కారాలు తెలుగు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకు లభించాయి. కొన్ని వివరాలు మీతో పంచుకుంటున్నాం.

ప్రతిష్ఠాత్మక, అతి ప్రధానమైన "అమేజింగ్ ఇండియన్ - 2024' అవార్డుకై కడివెండి మహిపాల్ చారిని పల్లెసృజన ప్రతిపాదించింది. వాలంటీర్ల సహాయముతో మూడు అంచల సెలక్షన్‌తో మహిపాల్ చారిని ఈ గౌరవ పూర్వక అవార్డు వరించింది. దంపతులు నవ్య - మహిపాల్ చారి ఇద్దరూ ఢిల్లీకి పయనమై అక్కడ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వారి అత్యున్నత ఆతిథ్యాన్ని అనుభవించి, కేంద్ర మంత్రి చేతుల మీదుగా "అమేజింగ్ ఇండియన్" బిరుదును స్వీకరించారు. వీరిద్దరి సౌకర్యానికి వాలంటీర్లు అనుక్షణం వారితో సంపర్కంలో ఉండి విజయవంతంగా, క్షేమంగా ప్రయాణానికి తోడ్పడ్డారు.

ఐఐఎం, అహమ్మదాబాద్, 'ఐమోక్స్' అవార్డుకై నామినేషన్లను ఆహ్వానించారు. 'మోధ శివకుమార్' అన్వేషించిన చేనేత మగ్గానికి పెడల్ ఆపరేటింగ్ మిషన్‌ను పల్లెసృజన ప్రతిపాదించింది. వాలంటీర్లు ఐఐఎం స్థాయిలో ఇన్నోవేషన్లను గురించి వ్రాయడం, అంచలంచలుగా జ్యూరీతో సంభాషణలు, వారి తీవ్రమైన ప్రశ్నలకు సరియైన సమాధానాలు, ఇన్నోవేషన్ - ఇన్నోవేటర్‌ల పూర్తి అవగాహన - ఇవన్నీ సాధించి, పైకి దూసుకెళ్తూ చివర్లో ఐమోక్స్ - ఐఐఎం అహమ్మదాబాద్ అవార్డును మోధ శివకుమార్ ఇన్నోవేషన్‌కు ప్రదానం చేయడం జరిగింది. ఇది మన వాలంటీర్ల నిరంతర శ్రమ, ఇన్నోవేషన్ లోని అత్యుత్తమ, సమాజంపైన సంవేదన, ఇన్నోవేటర్ల సహకారం, వారి ఓపిక - ఇవన్నీ ఈ విజయానికి కారణమైనవి.

నవంబరు 2024 లో 'హనీబీ నెట్‌వర్క్, గ్యాన్' సంస్థల ఆధ్వర్యంలో దేశ రాజధానిలో 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్' (ఇన్నోవేషన్ల పండుగ) జరిగింది. దేశంలోని అత్యుత్తమ నలభై ఇన్నోవేషన్లను అక్కడ ప్రదర్శించడానికి సెలక్షన్ జరిగింది. మరోసారి పల్లెసృజన వాలంటీర్ల కృషితో నలుగురు తెలుగు ఇన్నోవేటర్లకు ఈ దేశ స్థాయిలో తమ ఇన్నోవేషన్‌లను ప్రదర్శించడానికి అవకాశం లభించింది. అల్లాడి ప్రభాకర్, ప్రవీణ్ కుమార్, మెండె శ్రీనివాస్, షేక్ మౌలాలి ఢిల్లీకి వెళ్ళారు. వారిని ఎంతో గౌరవంగా మూడు రోజులు ఆతిథ్యమిచ్చారు. దేశ, విదేశ అత్యున్నత స్థాయి అధికారులు, "ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్"లో జరిగిన ఈ ఇన్నోవేషన్ల పండుగను సందర్శించారు. మన ఇన్నోవేటర్లకు మంచి గుర్తింపు, సత్కారం, సంతృప్తిని ఇచ్చిన ఈ ప్రదర్శనకు పల్లెసృజన వాలంటీర్లే కారణం, మాకు గర్వం కూడా. ఇన్నోవేషన్ల విశిష్ఠత ప్రముఖ కారణం.

11 డిశంబర్, 2024న హైదరాబాద్‌లోని తాజ్ ప్యాలెస్ హోటల్‌లో పల్లెసృజనకు ఇన్నోవేషన్ల ప్రదర్శనకై, పల్లెసృజన కార్యకలాపాల వివివరణకై ఆహ్వానం లభించింది. అమెరికా దేశంలోని న్యూ జెర్సి రాష్ట్ర గవర్నరు, నలభై మంది ప్రతినిధులతో హైదరాబాద్ సందర్శించిన సందర్భంలో ఈ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఇదొక గొప్ప అవకాశం. వాలంటీర్ల సహాయంతో ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. గ్రామస్తుల సరళ ఇన్నోవేషన్ల ప్రభావం సమాజంపై ఎలా ఉందో మన వాలంటీర్లు వివరించి చెప్పారు. విదేశీ అతిథులు ఎంతగానో స్పందించారు. ఆనంద పడ్డారు. భవిష్యత్తులో కలిసి ముందుకు సాగడానికి ప్రతిపాదించారు.

చివరగా 'నాస్కామ్ ఫౌండేషన్' వారి "టెక్నాలజీ ఫర్ ఛేంజ్" (మార్పు కోసం సాంకేతికత) అవార్డులకై పల్లెసృజన ఇన్నోవేటర్ మోధ శివకుమార్ ఇన్నోవేషన్‌ను ప్రతిపాదించింది. వాలంటీర్ల, ఇన్నోవేటర్ల కృషితో ఒక అవార్డుకై ప్రతిపాదిస్తే రెండు జాతీయ అవార్డులు మన ఇన్నోవేటర్లను వరించాయి. "యస్‌డిజి ఛాంపియన్ అవార్డు" మరియు "హెల్త్‌టెక్ అవార్డు" మోధ శివకుమార్ స్వీకరించారు. భవిష్యత్తులో వారి సంస్థ ద్వారా అతని ఇన్నోవేషన్‌ను సమాజానికి చేరడానికి సహాయాన్ని అందిస్తామని ఈ సందర్భంలో 'నాస్కామ్ ఫౌండేషన్' వారు హామీ ఇచ్చారు.

ఇలాంటి స్వచ్ఛంద ప్రయత్నాలు గత 19 సంవత్సరాలుగా పల్లెసృజన వాలంటీర్ల సహకారంతో, వారి దీక్షతో తెలుగు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్‌లను సమాజంతో, వ్యవస్థతో, జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సంధానం చేస్తున్నది. ఈ శ్రమ, వాటి ఫలితాలు పల్లెసృజనకు ఎంతో ఆనందాన్ని కల్గిస్తాయి. ఈ గుర్తింపులు సమాజంలో ఎంతో మందిని ప్రోత్సహించాలని, వ్యవస్థ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను సునాయాసంగా గుర్తించి, వాటి విస్తరణకై కృషి చేస్తుందని మీ అందరి తరుపున ప్రార్థిస్తూ, ఆశిస్తూ....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

## 'పద్మశ్రీ' పురస్కారాలు



చింతకింది మల్లేశం (2017)



దరిపల్లి రామయ్య (2017)



చింతల వెంకట్ రెడ్డి (2020)

## 'అంతర్జాతీయ' పురస్కారాలు



**నన్నం తిరుపతి రావు**
మొదటి బహుమతి, అంతర్జాతీయ స్థాయి
గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ పోటీలు (2019)



**మోధా శివకుమార్**
HBNCRIIA అవార్డు -2020
ఆరోహణ్-2023&నాస్కామ్-2024 అవార్డులు



**శ్రీమతి దూబ రాజు**
హనీబీ నెట్‌వర్క్ క్రియేటివిటీ & ఇన్‌క్లూజివ్
ఇన్నోవేషన్ అవార్డు (HBNCRIIA)-2020



**గొర్రె అశోక్**
ఇ- ఇన్నోవేట్ అవార్డు - 2021
పోలాండ్

## ఎన్ఐఎఫ్ వారి రాష్ట్రపతి పురస్కారాలు



**విక్రం రాథోడ్**
సైకిల్‌తో నీటిని తోడే పంపు
రాష్ట్రపతి పునస్కారం (2003)



**ఉప్పుతేళ్ళ కృష్ణ**
స్ప్రేయర్
రాష్ట్రపతి పురస్కారం (2007)



**చింతకింది మల్లేశం**
లక్ష్మి ఆసు యంత్రం
రాష్ట్రపతి పురస్కారం (2009)
'హాల్ ఆఫ్ ఫేం', న్యూ ఢిల్లీ (2012)
'అమేజింగ్ ఇండియన్' పురస్కారం (2021)



**బోయ పెద్ద రాజన్న**
పశువులకు మూలికా వైద్యం
రాష్ట్రపతి పురస్కారం (2012)
'హాల్ ఆఫ్ ఫేం', న్యూ ఢిల్లీ (2012)



**గల్లా చంద్రశేఖర్**
పంటల్లో నిమటోడ్స్ నియంత్రణకు
మూలికా మందు
రాష్ట్రపతి పురస్కారం (2013



**భూమయ్య చారి**
**విండ్ మిల్**
రాష్ట్రపతి పురస్కారం (2013)



**బొమ్మగాని మల్లేష్**
లైట్లు, ఫ్యాన్ ఆన్/ఆఫ్ చేసే రిమోట్
రాష్ట్రపతి పురస్కారం (2013)



**నజీర్ అహమ్మద్**
యంత్రానికే కారంపొడి
జల్లెడ పట్టే పరికరం
రాష్ట్రపతి పురస్కారం (2013)



**కె. చంద్రశేఖర్**
ఇటుకల తయారీ పరికరం
రాష్ట్రపతి పురస్కారం (2015)



**కంటాలి పాండు రంగారావు**
టైర్లు పంచరు కాకుండా ద్రావణం
రాష్ట్రపతి పురస్కారం (2017)



**కడివెండి మహిపాల్ చారి**
హ్యాండ్ వీడర్
రాష్ట్రపతి పురస్కారం (2015)
అమేజింగ్ ఇండియన్ (2024)



**నన్నంతిరుపతి రావు**
కరెంటు స్తంభాలను ఎక్కేపరికరం
రాష్ట్రపతి పురస్కారం (2018)



# రైతు శ్రమను తగ్గించే 'కృషి మిత్ర' సంచి

## సత్యనారాయణ చిన్న ఆలోచన

- వీరరాఘవ రెడ్డి

ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రైతుల ప్రధాన పంటలలో ముఖ్యమైనవి 'ప్రత్తి, మిరప' పంటలు అన్న విషయం అందరికీ విదితమే. పొలంలో చెట్ల నుండి తీసిన ప్రత్తి మరియు మిరప పంటలను పూర్వం గంపలలో వేసుకుని ఇంటికి తీసుకు వచ్చేవారు. ఆ గంపలు క్రింది భాగంలో తక్కువ వ్యాసంలోను, పైన భాగంలో ఎక్కువ వ్యాసంలోను ఉండేవి. కాబట్టి వాటిలో తెచ్చిన ప్రత్తి, మిరప పంట దిగుబడులను ఇంట్లో ఒక మండెగా ఏర్పాటు చేసిన వాటిపైన గుమ్మరించి వెళ్ళే వారు కూలీలు. ఇక్కడ ఆ గంపలను పొలం నుండి ఇంటికి మోసుకు రావటం కాస్త శ్రమగా ఉండేది. ఇంట్లోకి వచ్చిన తర్వాత మండె పైన గుమ్మరించి గంపను ప్రక్కన పెట్టి వెళ్ళేవారు.

కానీ, మారుతున్న కాలంలో ఈ గంపలను కొనటం కొంత ఆర్థికంగా కూడుకున్నవి కావటం, రైతులు విపరీతంగా పొలానికి రసాయన ఎరువులు వేయటం, ఆ ఎరువులకు వచ్చిన సంచులను వ్యవసాయ పనులకు ఉపయోగించటం వల్ల ఇప్పుడు గంపలు అనేవి దాదాపు కనుమరుగైపోయాయి. అందువల్ల ప్రత్తి, మిరప పంటలను పొలంలో తెంచిన తర్వాత వాటిని ఖాళీ ఎరువుల సంచులలో వేసుకుని ఇంటికి చేరుస్తున్నారు. పొలంలో తెంపిన పంటను సంచిలోకి వెయ్యటం సులభంగానే ఉంటుంది. సంచి నిండిన తర్వాత అందులో ఇంకా ఎక్కువ మోతాదులో నింపాలని సంచిలోని ప్రత్తి, మిరప లను చేతితో లేదా కాలితో నొక్కి ఎక్కువ ప్రమాణంలో నింపడం చేస్తున్నారు. వాటిని ఇంటికి తెచ్చిన తర్వాత మండె పైన వెయ్యడానికి ఆ సంచులలోని పంట దిగుబడి సంచిని ఇలా బోర్లిస్తే క్రింద పడదు. ఎందుకంటే వాటిని బాగా నొక్కి నింపడం వల్ల అవి త్వరగా బైటకు రావు. అందుకు సంచిలోని సరుకును కొంత చేతితో తీసి, సంచి క్రింది వైపున్న కొసలను చేతితో పట్టుకుని బలంగా విదిలిస్తే తప్ప ప్రత్తి, మిరప కింద పడవు. ఇందుకు కొంతవరకు మనిషి శ్రమ పడాల్సి ఉంటుంది.

ఈ శ్రమ పడాల్సిన అవసరం లేకుండా ఒక చిన్న ఆలోచన చేశాడు పల్నాడు జిల్లా, దుర్గి మండలం, అడిగొప్పుల గ్రామానికి చెందిన రైతు 'దమ్మాలపాటి సత్యనారాయణ'. దీన్ని ఎవరికి వారే చేసుకోవచ్చు. అదనంగా ఖర్చు పెట్టి కొనాల్సిన అవసరం లేదు. ఇక్కడ ప్రత్తి, మిరప రైతులు చేయవలసిందల్లా ఒక్కటే మీ ఎరువుల సంచులు పైన క్రింద సమాన వెడల్పులో ఉంటాయి. అంటే అవి స్థూపాకారంలో ఉంటాయి. వాటిని ఒక కుట్టు మిషన్ పైన స్థూపాకారంగా కాకుండా గరాటు (కోణాకారం) ఆకారం లో వచ్చేలా కుట్టుకోవాలి. అంటే సంచి పై భాగంలో అంతే వెడల్పు ఉండనిచ్చి, అడుగు భాగానికి వచ్చే సరికి 4-5 అంగుళాలు సంచి వెడల్పు తగ్గేలా చేసుకుంటే చాలు. ఇప్పుడు పొలంలో ఆ సంచుల్లో ప్రత్తి మిరప నింపుకుని ఇంటికి వచ్చిన తర్వాత మండెపైన



నంచిని బోర్లించి, తక్కువ శ్రమతో పైకి ఎత్తితే చాలు సంచిలోని సరుకంతా సులభంగా క్రిందకు పడిపోతుంది.

చిన్న, సన్నకారు రైతులు తమ దిగుబడులను పొలం నుండి ఇంటికి తలపైన పెట్టుకొని వస్తుంటారు. కానీ పెద్ద కమతాలున్న రైతులు పొలం నుండి సంచులను ట్రాక్టర్లు లేదా ఎద్దుల బండ్లలో వేసుకుని తీసుకు వస్తుంటారు. అలా తీసుకు వచ్చేటపుడు కూడా సంచుల ఎదురు ఎదురుగా అంటే మూతి భాగం ఒక వరుస ఒక వైపు, మరో వరుస వ్యతిరేక దిశలో వేసుకుని తీసుకు రావచ్చు కాబట్టి రవాణా చేసుకోవ టానికి ఇబ్బంది అవుతుందన్న అనుమానం ఏమీ అవసరం లేదు.

ఈ ఆలోచన చాలా చిన్నదే. కానీ మనిషి ఎంత శ్రమను తగ్గిస్తుందో చూడండి. అలా సంచులను కుట్టుకోవడం వల్ల వాటిని ఖాళీ చెయ్యడానికి ఎటువంటి శ్రమ పడాల్సిన అవసరం లేదు. 'ఒక చిన్న ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది' అనటానికి ఇదొక చిన్న ఉదాహరణ అని చెప్పుకోవచ్చు కదా! దీన్నే హిందీ ఇంగ్లీషు కలిపి చెప్పే వాళ్ళు 'వాట్





ఎన్ ఐడియా సర్ జీ' అంటారు. ఈ పని చేసుకోవటానికి పెద్దగా ఖర్చు లేదు, నష్టము లేదు, శ్రమ తగ్గుతుంది. సత్యనారాయణకు రైతు పని అంటే మక్కువ, ప్రేమ ఎక్కువ. అందుకే ఆయన "అమ్మ చేతికి అన్నమిచ్చి, దేవుడికి నైవేద్యమిచ్చి, జాతికే బువ్వ పెట్టి, ఆకలి కడుపు బాధకు ఔషధమిచ్చిన అమృతమూర్తి రైతన్న" అంటాడు.

ఈ చిన్న ఆలోచనను యావత్ రైతాంగం ఆచరించి, మీ శ్రమను కొద్దిగా తగ్గించుకోవటమే కాక, వీరి ఆలోచనను ప్రతి రైతు తమ తోటి రైతులతో పంచుకోవాలని కోరుతోంది పల్లెసృజన. ●

**ఇన్నోవేటర్ సత్యనారాయణ, ఫోన్ : 7993858472**

# ఔషధ మొక్కలు - అడవిలో లభించే పండ్ల చెట్లతో రైతులకు లాభసాటియైన సాగు

**- కొమెర జాజి, పర్యావరణ వేత్త**

నేల తంగేడు, సునాముఖి, వామింట వంటి ఔషధ మొక్కలు, జాన, కలేకాయలు, చిటిమిటి, బలిజ, పాల పండ్లు వంటి పండ్లు, కాయల మొక్కలకు పంటగా వేయడం రైతులు ఎంతో లాభసాటి. నేల తంగేడు, వామింట, సునాముఖి, అతిబల ఔషధాలకు మార్కెట్‌లో మంచి విలువ ఉంది.

జూన్‌లో తొలకరి వర్షాలు వచ్చాక తొలిసారి పంటకు వచ్చే కాయలు జాన కాయలు. వీటినే కొండ జాన పండ్లు అంటారు. జులై నెలలో ఇవి నెలంతా కనిపిస్తాయి. ఆగస్టులో వచ్చే కలే కాయలు, చిటిమిటి కాయలు, సెప్టెంబర్‌లో వచ్చే బలిజ కాయలు, జనవరిలో వచ్చే నాగజెముడు వంటి కాయలు ఆయా మాసములలో అధికంగా దిగుబడినిస్తాయి. నీటి వసతి లేకపోయినా సరే ఇవి కేవలం వర్షాధారం, ఎండ గాలి ద్వారానే పంటను అందిస్తాయి. వాతావరణ మార్పులను సమర్థవంతంగా తట్టుకుంటాయి. అతివృష్టి, అనావృష్టి బాధలను ఇవి తట్టుకోగలవు. చీడపీడల బాధ ఉండదు. అడవి పందులు, ఇతర జంతువుల బాధ కూడా ఉండవు. ఒక్కసారి పెట్టుబడి పెడితే చాలా జీవితాంతం పంట దిగుబడిని పొందవచ్చు. నాలుగెకరాలున్న రైతు ఒక్కో ఎకరంలో ఒక్కో పంట వేస్తే ప్రతి నెలా ఆదాయం వస్తుంది. ఒక్కో చెట్టు ద్వారా ఎంతో లాభం వస్తుంది. వీటి పండ్లు కేవలం సీజన్‌లో మాత్రమే లభిస్తాయి కాబట్టి వీటికి మార్కెట్‌లో మంచి డిమాండు కూడా ఉంటుంది. ఇవన్నీ చాలా రుచికరమైన పండ్లు. వీటిని ఎలాంటి ఎరువులు, పురుగు మందులు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. స్వచ్ఛంగా ప్రకృతి ప్రసాదం వల్ల లభించే పండ్లు కాబట్టి వీటిని తినటానికి ప్రజలు ఆసక్తి చూపుతారు.




కాబట్టి కొందరు పెద్ద కమతాలున్న రైతులు కొన్ని ప్రాంతాలలో వ్యవసాయం చేసుకోలేక తమ పొలాలను బీడు పెట్టుకుంటూ ఉంటారు. అటువంటి రైతులు ఒక్కసారి కష్టపడి ఈ మొక్కలను నాటుకో గలిగితే ఇక ఎటువంటి కష్టం లేకుండా జీవితాంతం ఫలసాయం పొందవచ్చు.

వివరాలకు : **కొమెర జాజి, ఫోన్ : 99084 11700**

# అమరేంద్ర చక్కటి ఇన్నోవేషన్‌తో
# వాక్కాయల కోత ఎంతో సులభం



- వీరరాఘవ రెడ్డి

ప్రస్తుతం రైతాంగం ఎక్కువగా ఉద్యాన తోటల వైపు మొక్కు చూపుతున్నారు. ముఖ్యంగా పండ్ల తోటలు, శ్రీగంధం, ఎర్ర చందనం లాంటి వాటి పెంపకం చేపడుతున్నారు. ఇలాంటి వాటిలో ముఖ్యంగా పండ్ల తోటలకు జంతువులు, మనుషుల బెడద ఎక్కువగా ఉండటంతో తమ పొలాల చుట్టూ 'సోలార్ ఫెన్సింగ్' ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనివల్ల అనవసరపు ఖర్చు, పైగా ఆ ఫెన్సింగ్ వల్ల ఎటువంటి ఆదాయం రాదు సరికదా, నిర్వహణా ఖర్చు కూడా కొంత వరకు ఉంటుంది, అందువల్ల ఈ ఫెన్సింగ్ బదులుగా 'జీవ కంచె'లను ఏర్పాటు చేసుకున్నట్లయితే మీ సమస్య తీరటంతో పాటు, పొలం గట్లు కూడా ఆదాయాన్ని సమకూరుస్తాయని 'పల్లెసృజన'తో పాటు అనేక స్వచ్ఛంద సంస్థలు, ఉద్యాన శాఖ అధికారులు చెబుతుండటంతో జీవ కంచెగా "వాక్కాయ" చెట్లను గట్లవెంట పెంచుతున్నారు. రైతులు వాక్కాయను ఎంచుకోవటానికి రెండు కారణాలు. మొదటిది కేవలం ఒకటి లేదా ఒకటిన్నర సంవత్సరాల్లోనే ఆ మొక్కలు బాగా ఎదిగి, ఆఖరుకు కుందేళ్ళు కూడా అందులో నుండి దూరలేనంతగా దట్టంగా అలుముకుంటాయి. ఇక రెండోది పొలం గెట్ల నుండి కూడా ప్రతి సంవత్సరం వాటి పండ్ల ద్వారా కూడా ఆదాయం పొందవచ్చు.

ఈ వాక్కాయ చెట్లు ముండ్లతో కూడి ఉంటుంది కాబట్టి వీటి కాయలను కోసుకోవడం కొంత కష్టంతో కూడుకున్న పని. చాలా జాగ్రత్తగా కొయ్యాలి, వీటి కాయలు తెంపేటపుడు వాటి నుండి తెల్లటి పాలు కారుతాయి. అవి బంకలా బాగా జిగటగా మారుతుంది. కాబట్టి కూలీలు వాటిని కొయ్యడానికి బాగా ఇబ్బందికి గురవుతారు. వీటి పండ్లను కోత కోయకుంటే అవి క్రిదకు రాలి, అవి మొక్కలుగా మారి, పొలమంతా అవే తయారయ్యే అవకాశముంటుంది. కాబట్టి ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఆ పండ్లను కోసి అమ్ముకుంటే రైతుకు ఆదాయం, పొలం గట్టు సురక్షితం. ఇన్ని రకాల ఆదాయాన్ని సమకూర్చి, రైతుకు తక్కువ ఖర్చుతో, ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేకుండా పొలాన్ని రక్షించే ఈ పంట కోత వల్ల ఇబ్బంది తలెత్తుతుంది, దీనికి పరిష్కారం కనుగొంటే రైతుకు ఎంతో మేలు జరుగుతుంది అని గ్రహించిన ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా, నాదెండ్ల మండల కేంద్రానికి చెందిన 40 సంవత్సరాల వయస్సు గల 'చేకూరి అమరేంద్ర' అనే రైతు ఒక చిన్న యంత్రాన్ని తయారు చేశాడు.

చేకూరి అమరేంద్ర ఒక సామాన్య మధ్య తరగతి వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తి. 10వ తరగతి పూర్తి అయిన తర్వాత ఐటిఐ ఎలక్ట్రానిక్స్ చేశాడు. ఐటిఐ పూర్తి కాగానే కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడాలి అన్న ఉద్దేశ్యంతో ఉద్యోగం కొరకు ఎన్నో కష్టాలు పడి 'దుబాయ్'కి వెళ్ళడం జరిగింది. కానీ ఇతనికి వ్యవసాయం అంటే మక్కువ ఎక్కువ. దుబాయ్ లో కొన్ని సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత తిరిగి మన దేశానికి రావటం, అనుకోకుండా అతనికి ఒక ప్రమాదం జరిగటంతో తిరిగి ఉద్యోగానికి వెళ్ళే అవకాశం లేకుండా పోవటం జరిగింది. ఇక తల్లిదండ్రులను వదలి ఉద్యోగానికి వెళ్ళటం ఎందుకు? ఇక్కడే ఏదో ఒక ఉద్యోగమో, వ్యాపారమో చేసుకుంటూ ఇంటి పట్టునే ఉండటం మేలు కదా అని ఆలోచించి, నర్సరీని ఏర్పాటు చేసుకున్నాడు. అతను ఈ వ్యాపారం లోకి వెళ్ళే ముందు అతని ప్రాంతంలో ఎక్కువగా ప్రత్తి, మిరప లాంటి పంటలు మాత్రమే రైతులు సాగు చేయటం గమనించాడు. ఈ పరిస్థితిని ఒక దశాబ్ద కాలం పాటు గమనించాడు. అందరు రైతులు సాంప్రదాయ పంటలైన మిర్చి, ప్రత్తి మాత్రమే వేస్తూ విపరీతమైన నష్టాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిని మార్చగలిగితే అదే నాకు జీవనోపాధి అవుతుంది కదా అని ఆలోచించాడు అమరేంద్ర. అతని ఆలోచన ప్రకారం 'సుగంధ ద్రవ్యాల' మొక్కలకు చెందిన శ్రీగంధం, ఎర్ర చందనంలతో పాటు కొన్ని రకాల పండ్ల మొక్కలను ఈ ప్రాంత రైతులకు పరిచయం చేస్తే బావుంటుంది



కదా అనుకున్నాడు. సరే ప్రయత్నిద్దాం అని తను స్వయంగా ఒక నర్సరీ ఏర్పాటు చేసుకుని అందులో మామిడి, సీతాఫలం, వాక్కాయ లాంటి మరెన్నో ఫలాలను అందించే మొక్కలను ఏర్పాటు చేసుకుని తన వ్యాపారాన్ని ప్రారంభించాడు.

ఈ వ్యాపారంలో అమరేంద్ర ఒక విషయం గ్రహించాడు. 'వాక్కాయ' చెట్లను అప్పటి వరకు కేవలం ఫెన్సింగ్ కొరకు మాత్రమే వాడేవారు. వాటి నుండి వచ్చిన కాయలను ఆయా రైతులు ఇండ్లలో పప్పు, కూరలు చేసుకుంటారు. అదో రకంగా పుల్ల పుల్లగా ఉంటాయి కాబట్టి చిన్న పిల్లలు వీటిని తినటానికి ఇష్టపడతారు. కొందరు రైతులు పప్పులో చింతపండు బదులు ఈ వాక్కాయలను వాడుకుంటారు. ఇటీవల వీటికి ఇతర రాష్ట్రాల నుండి గిరాకీ బాగా పెరిగింది. దానికి కారణం ఈ వాక్కాయలను కేకులు, ఇతర తినుబండారాల్లో ఉపయోగిస్తున్నారు. వాక్కాయలకు మార్కెట్ లో కిలో రూ. 40 నుండి 50 వరకు ధర పలుకుతుంది. ఇదంతా బాగానే ఉంది కానీ, ఇక్కడే ఒక పెద్ద సమస్య వచ్చిపడింది. ఈ సమస్యను రైతులు అమరేంద్రతో చర్చించారు. పండ్లు తెంపడం కష్టంగా ఉంది, కూలీలు రావటం లేదు. ఎవరో కొందరు స్థానిక వ్యాపారులు మాత్రం వారే 10-20 కిలోలు తెంపుకుని మార్కెట్‌లో అముకుంటునారు. ఇంకా చాలా పండ్లు చెట్టుపైనే పండి అవి క్రిందకు రాలి పడిపోతున్నాయి. కాబట్టి వీటిని తెంపేటందుకు పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు అమరేంద్ర. వీటిని కూలీలతో





కాకుండా తెంపేటందుకు ఒక చిన్న యంత్రం తయారు చేస్తే బావుంటుందని ఆలోచించాడు. ఎలా చెయ్యాలి అని ఆలోచిస్తున్న సమయంలోనే ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన వ్యాపారులు కొందరు వచ్చి వాక్కాయ పండ్లు టన్నుల కొద్దీ కావాలని అడిగారు. వీటితో మీరేం చేస్తారు? అని అడిగితే వీటిని టూటీ ఫ్రూటీ చెయ్యటానికి, వీటిని చక్కెర పాకంలో వేసి చెర్రీ పండ్ల లాగా బేకరీలలో ఉపయోగిస్తారు అన్నారు. కొందరు రైతులు ఒక్కో కూలీకి 3-4 వందలు ఇచ్చి కోపించి అమ్ముకునే వారు. ఒక మనిషి 20-30 కిలోల కంటే ఎక్కువ కోయలేక పోయేవారు. వీటిని తెంపేటపుడు పాలు కారి చేతులకు బంక అంటుకుంటుంది కాబట్టి ప్రతి కూలీ ఒక చిన్న బకెటలో నీళ్ళను కూడా తీసుకు వెళ్లి, కాయలు కోసిన వెంటనే వాటిని నీళ్ళల్లో వేయాలి. లేకుండా చేతులకంతా బంక అంటుకుని పని చేయుటం కష్టంగా ఉంటుంది. కాబట్టి రైతుకు గిట్టుబాటు తక్కువగా ఉండేది. ఒక కిలో పండ్లను అప్పట్లో 50 నుంచి 60 రూపాయలకు కిలో చొప్పున కొనేవారు.

ఇక్కడ రైతులు గమనించింది ఏమిటంటే, వీటిని పెంచటానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం లేదు. నీరు అందించాలన్న సమస్య లేదు. కేవలం వర్షాధారంగా పండుతాయి. ఒక్కో చెట్టుకు 30 నుండి 40 కిలోల వరకు పండ్లు కాస్తాయి. చేలోకి ఎటువంటి అడవి జంతువులు రాలేవు. ఇలా అన్ని విధాలుగా ఈ చెట్లు లాభదాయకమే. కాబట్టి రైతులు ఒకరిని చూసి మరొకరు ఈ చెట్ల పెంపకం చేపట్టారు. ఇది చూసి కొందరు రైతులు తన సమీపంలోని నూజివీడులో ఒక రైతు 50 ఎకరాలు మరి కొన్ని ప్రాంతాల్లో తమ మొత్తం పొలంలో ఈ వాక్కాయ చెట్లను నాటడం మొదలు పెట్టారు. పెద్దగా కష్టం లేకుండా ఎంతో కొంత ఆదాయం వస్తుంది కనా అనుకుని ఈ పంట సాగుకు సిద్ధపడుతున్నారు. కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో ఈ పంట సాగు వందల ఎకరాల్లో బాగా విస్తరించింది.

డిమాండు బాగానే ఉంది కానీ, పండ్లను కొయ్యటమే సమస్యగా ఉంది కాబట్టి ఇక ఇప్పుడు ఈ యంత్రం తయారీ అత్యవసరం అని అనుకున్నాడు. వాక్కాయలను కోయటానికి ఒకటి రెండు యంత్రాలను తయారు చేసి చూశాడు. కానీ, ఏదీ విజయవంతం కాలేదు. ఎలా చెయ్యాలిఅని ఆలోచిస్తున్న సమయంలో అతను అతనికి వరి, కంది పంటలను కోసే హార్వెస్టర్ లోని సాంకేతికతను మూలంగా తీసుకున్నాడు. సోలార్ పవర్ ద్వారా బ్యాటరీతో నడిచేలా, హార్వెస్టర్ లో ముందువైపు ఏర్పాటు చేయబడి వున్న పళ్ళ లాంటివి ఏర్పాటు చేసి తయారు చేశాడు. ఈ యంత్రాన్ని చెట్టుకు పండ్లు ఉన్నచోట పెట్టి ఆన్ చేస్తే కొమ్మలు చాలా వరకు దెబ్బ తినకుండా పండ్ల గుత్తులను కోసి

వేస్తుంది. కోసిన పండ్లను సేకరించి, ఆ యంత్రానికే అమర్చిన ఒక గొట్టం ద్వారా వచ్చి పండ్లను కోసే మనిషి వళ్ళో ఏర్పాటు చేసుకున్న సంచిలోకి అవి చేరుకునేలా ఏర్పాటు చేశాడు. ఇక చేతులకు ముళ్ళు కుచ్చుకుంటాయి, బంక అంటుకుంటుంది అనే సమస్యే లేదు. దాదాపు రెండు సంవత్సరాలు కష్టపడి ఈ యంత్రాన్ని తయారు చేశాడు అమరేంద్ర. ఇప్పుడు అది విజయవంతంగా పని చేస్తోంది. దీన్ని ఇంకా ఎంతో అభివృద్ధి చేయవచ్చు. అలా చేయగలిగితే పెద్ద మొత్తంలో వందల ఎకరాలు సాగు చేసిన రైతులు కూడా సునాయాసంగా వాక్కాయలను కోసి మార్కెట్‌లో విక్రయించుకోవచ్చు. ఈ యంత్రం మధ్య తరగతి రైతు కూడా కొనగలిగేలా అందుబాటు లోనే ఉంటుందన్నాడు అమరేంద్ర.

ఇప్పుడు ఈ యంత్రంతో ఒక మనిషి రోజుకు 3 వందల కిలోల వరకు పండ్లను ఎటువంటి ఇబ్బంది లేకుండా తెంపగలరు. ఒక మనిషి చేత్తో పండ్లను కోస్తే 30 కిలోల వరకు కోసేవారు, ఇప్పుడు అదే ఒక మనిషి 300 కిలోల పండ్లను కోస్తున్నాడు. అంటే 10 మంది చేసే పనిని కేవలం ఒక్క మనిషి చేస్తున్నాడు. ఎన్ని రెట్లు రైతుకు లాభం ఉంటుందో ఆలోచించండి. ఇలాంటి యంత్రం తయారు కావటం వల్ల ఇప్పుడు వాక్కాయలను కొనే వ్యాపారులు ముందుగా ఫోన్ చేసి, మేము ఫలానా రోజు వస్తున్నాము, మాకు ఇన్ని క్వింటాళ్ళ పండ్లు కావాలి అంటే చాలు, వాళ్ళు వచ్చేకన్నా ఒక రోజు ముందుగానే ఆ పండ్లను తెంపి సిద్ధంగా ఉంచుకో గలుగుతున్నారు రైతులు.

అమరేంద్ర తయారు చేసిన ఈ యంత్రానికి బాగా ప్రాచుర్యం కలిగించి, వీటిని అధిక మొత్తంలో తయారు చేయించేందుకు, రైతుల వద్దకు చేరేలా ప్రయత్నాలు చేస్తోంది 'పల్లెసృజన'. ఒక చిన్న యంత్రాన్ని తయారు చేసి, రైతుకు ఎంతో ఆదాయం చేకూర్చటంతో పాటు, అధిక మొత్తంలో వాక్కాయ దిగుబడి సాధించటంతో పాటు, కంచె అవసరం ఉన్న ప్రతి రైతు ఇక సోలార్ ఫెన్సింగ్‌ల జోలికి పోకుండా, ఈ జీవ కంచెలను ఏర్పాటు చేసుకునేలా ప్రేరేపించ గలిగిన ఇన్నోవేటర్ 'చేకూరి



అమరేందర్'ను అభినందిస్తోంది పల్లెసృజన. అమరేంద్ర ఇన్నోవేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు, సరియైన సహాయం కొరకు 'పల్లెసృజన' కృషి చేస్తోంది. ఈ పరికరంపై వివరాలు కావలసిన వారు సంప్రదించ గలరు.

**ఇన్నోవేటర్ చేకూరి అమరేంద్ర, ఫోన్ : 94419 82491**

# సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత 18 సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 18 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరిం చాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము.

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందు బాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలున్నా'పల్లెసజన' ను సంప్రదిం చడానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం. -పల్లెసృజన.

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866 00 1678, వీరరాఘవ రెడ్డి : 81257 99904 / 79890 38186



# ప్రకృతి ఆశీర్వాదాలను సమాజానికి అందిస్తున్న 'ఆకుల' రామారావు

- వీరరాఘవ రెడ్డి

ప్రతి మనిషి ఏదో ఒక పని చేస్తుంటాడు. కానీ, ఆ చేసే పనిలో అర్థం – పరమార్థం ఉంటే....... అది మనసుకు వర్ణించరాని ఆనందాన్ని ఇస్తుంది. ఇక్కడ పల్లెసృజన పాఠకులకు పరిచయం చేయబోతున్న వ్యక్తి పేరు "రామారావు". వయసు 55 సం.లు, నివాసం కొవ్వూరు సమీపం లోని 'కుమార దేవరం' అనే గ్రామం. ఇతని భార్య 'రమణమ్మ'కు క్యాన్సర్ వ్యాధి, ఎక్కువగా పని చెయ్యలేదు, ఆయాస పడిపోతూ ఉంటుంది. ఇతని ఇద్దరు కూతుర్లకు వివాహం చేశాడు. ఒక కొడుకు కూడా ఉన్నాడు కానీ, అతను మానసిక వ్యాధిగ్రస్తుడు. ఏమీ మాట్లాడలేడు, ఏ పనీ చెయ్యలేడు. ఇంతటి బాధల్లో ఉన్న రామారావు కృంగిపోకుండా తన జీవన యాత్రను కొనసాగిస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ఇతని వ్యాపారం ప్రకృతి పరంగా లభించే ఆకు కూరలను తీసుకెళ్ళి మార్కెట్‌లో విక్రయించడం.

మొదట రామారావు అరటి పండ్లు, కొన్ని రకాల ఆకు కూరలు అమ్మేవాడు. అలా వ్యాపారం చేసుకుంటున్న సమయంలో తాను అరటి పండ్లతో పాటు 'గుంట గలగర' ఆకును కోసుకుని వాటి కూర చాలా బాగుంటుంది, మంచి ఆరోగ్యాన్ని ఇస్తుంది అని చెప్పి అమ్ముకునేవాడు. ఆ ఆకును చూసిన ఒక వినియోగ దారుడు రామారావుకు గుంట గలగర ఆకు యొక్క ఔషధ గుణాలను గురించి వివరంగా తెలియజేయటంతో పాటు, మరి కొన్ని రకాల ఔషధ గుణాలున్న ఆకులను గురించి వివరించాడట. ఆ తర్వాత రామారావుకు ఇదేదో బాగుందే. దీన్నే వ్యాపారంగా చేసుకుంటే బావుంటుంది కదా అని అప్పటి నుంచి ఔషధ గుణాలున్న మొక్కలను గురించి తెలుసుకుని, ఏ కాలంలో లభించే ఆకు కూరలను ఆ కాలంలో సేకరించి తెచ్చుకుని తన గ్రామానికి 15 కిలోమీటర్ల దూరంలో వున్న 'రాజమండ్రి'కి వెళ్ళి అమ్ముకుంటూ ఉంటాడు.

రామారావు అమ్ముకునే ఆకుల్లో ప్రధానమైన ఆకులు – వాటి ఔషధ గుణాలను గురించి తెలుసుకుందాం. 'కొండ పిండి ఆకు' (దీన్నే తెలకపిండి మరియు పిండికూర ఆకు అని కూడా అంటారు) – ఇది కిడ్నీలోని రాళ్ళను పిండి చేస్తుందని ఆయుర్వేద వైద్యులు చెబుతుంటారు. 'తిప్ప తీగ ఆకు' ఇది మనిషిలోని వ్యాధి నిరోధక శక్తిని చాలా బాగా వృద్ధి చేస్తుంది, రక్తప్రసరణ బాగా జరిగేలా చేస్తుంది. మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుతుంది. 'నేలవేము' – ఇది మధుమేహాన్ని అదుపులో ఉంచడంతో పాటు, అతిమూత్ర వ్యాధి నివారణకు చాలా బాగా పని చేస్తుంది. 'నల్లేరు' కాడ – దీన్ని బియ్యపు పిండితో కలిపి రొట్టెగా చేసుకొని తినటం వల్ల ఎముకలు విరిగిన వారికి తమ ఎముకలు త్వరగా కట్టుకుంటాయి, అవి బలంగా మారుతాయి. దీన్ని రోటి పచ్చడిగా చేసుకుంటే శరీరంలోని అదనపు నీటిని, తీసివేయటంలో చాలా బాగా పని చేస్తుంది. అంటే ఊబ కాయం ఉన్నవారు ఈ పచ్చడిని తమ ఆహారం లో విరివిగా తీసుకుంటూ ఉన్నట్లయితే త్వరగా బరువు తగ్గే అవకాశం. 'మునగ ఆకు' – ఇది మలబద్ధకం, గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. 'గుంట గలగర' ఆకు (భృంగరాజ ఆకు) – దీని రసం లివర్ సమస్యలకు బాగా పని చేస్తుంది. అలాగే ఈ ఆకులను మెత్తగా నూరి, కొబ్బరి నూనెలో కలుపుకుని తలకు పట్టిస్తూ ఉండటం వల్ల జుట్టు రాలే సమస్య పోవటంతో పాటు, జుట్టు బాగా పెరుగుతాయి.

ఇవే కాక ఇంకా ఎన్నో రకాల ఆకు కూరలను ప్రతి రోజూ ఉదయమే వెళ్ళి మధ్యాహ్నం వరకు సేకరించి తెచ్చుకుని వాటిని సాయంత్రం మార్కెట్‌లో విక్రయిస్తూ ఉంటాడు రామారావు. ఇతను ప్రతిరోజూ ఇలాంటి ఆకులనే తెచ్చి విక్రయిస్తూ ఉండటం గమనించిన కొందరు ఆయుర్వేద జ్ఞానమున్న వినియోగదారులు ఇతనికి చెప్పి కొన్ని రకాల ఆకులను తెప్పించుకుంటున్నారు. అలా చేస్తూ ఉండటం వల్ల ఇతని పేరు "ఆకుల" రామారావుగా మారిపోయింది. తాను చేస్తున్న పని వల్ల ఎవరికైనా అదే తన ఇంటిపేరుగా మారటం చాలా గొప్ప విషయం.

తన గ్రామంలోని పొలాలకు వెళ్ళి తనకు కావలసిన ఆకులను కోసుకోవటం వల్ల పొలం యజమానులకు కలుపు తీసినట్లు అవుతుంది కాబట్టి అతన్ని ఎవ్వరూ అభ్యంతర పెట్టరు. వాటిని కోసుకునేందుకు తాను ఎవ్వరికీ డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు అంటే పెట్టుబడి లేదు. కేవలం శారీరక శ్రమ మాత్రమే ఉంది. ఇతను అమ్మే ఆకుల వల్ల సమాజానికి ఆరోగ్యం అందిస్తున్నాడు. ఇలా రైతులకు మేలు చేస్తూ, సమాజానికి ఆరోగ్యాన్ని అందిస్తూ, రోజుకు వెయ్యి రూపాయల దాకా సంపాదించి తన కుటుంబ భారాన్ని మోస్తూ అవిరళ కృషి చేస్తున్న 'ఆకుల రామయ్య' ఎంతో అభినందనీయుడు. ఎంతో మంది ఆకు కూరల వ్యాపారం చేసుకునే వారికి ఇతడో మార్గదర్శి అయ్యాడు అనటం లో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇలాగ కూడా సమాజానికి ఆరోగ్యాన్ని పంచవచ్చు అని నిరూపిస్తున్న "ఆకుల రామారావు"ను మనమదరం తప్పక అభినందించి తీరాలి అని కోరుకుంటోంది 'పల్లెసృజన'.

**ఆకుల రామారావు, ఫోన్ : 9133598137**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## కోళ్ళ ఫారాల్లో నేలను తిరగతోడే (రేకింగ్) యంత్రం

**సమస్య – పరిష్కారం :**

కోళ్ళు ఆరోగ్యదాయకంగా పెరగాలంటే తరచూ కోళ్ళ ఫారాలలోని నేలను తిరగతోడుతూ వుండాలి. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. చాలామంది కూలీలు అవసరం అవుతూ వుంటారు.

ఈ ఖర్చును తగ్గించటానికి గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'సురేష్ భాయ్ నరోత్తమ్ భాయ్ పటేల్' అనే రైతు 'పౌల్ట్రీ రేకింగ్' యంత్రాన్ని తయారు చేసుకున్నాడు.

**పరికరం :**

కరెంటుతో పనిచేసే ఈ యంత్రం కోళ్ళ ఫారంలోని నేలను తిరగతోడి మళ్ళీ చదునుగా చేస్తుంది. యంత్రానికి అమర్చిన ఒక హ్యాండిల్ వట్టుకొని నడువుతూ వుంటే చాలు. మోటారును యంత్రంలోని ఒక పుల్లీతో అనుసంధానం చేసి, తద్వారా చైన్ సహాయంతో స్ప్రాకెట్ తిరిగేలా ఏర్పాటు చేశాడు. మోటారు వేగాన్ని 1 : 34 నిష్పత్తిలో తగ్గించాడు. తిరగ తోడటానికి బ్రేడ్లు కల చక్రాలను అమర్చాడు.



**సాంకేతిక వివరాలు :**

- 1400 ఆర్.పి.యం. కలిగిన సింగిల్ పేజ్ మోటారును ఉపయోగించడం జరిగింది.
- 25 సెంటీమీటర్ల వ్యాసార్థం కలిగిన పుల్లీ ఒకటి, 8 సెం.మీ. వాసార్థం గల పుల్లీ ఒకటి ఉపయోగించబడింది.
- 2 సెం.మీ. వెడల్పు కలిగి, 103 సెం.మీ. పొడవుగల 'వి' బెల్టును ఉపయోగించడమైంది.
- 25 సెం.మీ గల స్ప్రాకెట్ ఒకటి, 6 సెం.మీ. వాసార్థం కలిగిన స్ప్రాకెట్ ఒకటి, మొత్తం రెండు స్ప్రాకెట్లను వినియోగించడమైంది.
- 1.5 సెం.మీ. వెడల్పు, 85 సెం.మీ పొడవు కలిగిన చైను వినియోగించడమైంది.
- రేకింగ్ కొరకు 75 సెం.మీ. పొడవు గల స్టీలు బ్లేడ్లను వినియోగించాడు.
- 40 సెం.మీ. వ్యాసార్థ కలిగిన రెండు లోహపు చక్రాలను అమర్చాడు.

**ముఖ్యాంశాలు :**

- ఈ యంత్రాన్ని వాడటం వలన 50% వరకు కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చు.
- సాధారణంగా 6 గంటల్లో చేసే పనిని, ఒక గంటలో చెయ్యవచ్చు.
- ఇద్దరు మనుషులు 15,000 చదరపు అడుగుల స్థలాన్ని రేకింగ్ చేయవచ్చు.





❀ కోడిపిల్లలు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా పెరగటానికి రేకింగ్ చేయటం తప్పనిసరి.

❀ కూలీలతో చేసే రేకింగ్‌కన్నా, ఈ యంత్రంతో చేసిన రేకింగ్ వలన కోళ్ళ ఫారాలలో దుర్గంధం తగ్గటం గమనించ వచ్చు.

**పురస్కారాలు :**

❀ 2013లో ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ప్రోత్సాహక బహుమతి లభించింది.

## కోడిగుడ్లు పొదగబెట్టే పరికరం (ఎగ్ ఇంక్యుబేటర్)

**సమస్య – పరిష్కారం :**

కోళ్ళ పెంపకం అన్నది గ్రామీణ ప్రాంతాల్లో, ప్రత్యేకించి యువతకి మంచి ఉద్యోగావకాశాలు, ఆదాయము కల్పించే వ్యాపకం. చాలామంది సాధారణంగా చిన్న కోడిపిల్లలను కొని, వాటిని పెద్దగా అయ్యేంత వరకు దాణా వేసి పెంచి, ఒక వయసు వచ్చిన తర్వాత లాభసాటి ధరకు అమ్మి లాభం చేసుకోవటం జరుగుతూ వుంటుంది. ఇటువంటి వారు కోడిపిల్లలను కొనే బదులు ఒక ఇంక్యుబేటర్ ఏర్పాటు చేసుకొని గుడ్లనుండి పిల్లలను పొదిగించ గలిగితే ఇంకా లాభసాటిగా వ్యాపారం చేసుకునే అవకాశం ఉంటుంది. బజార్లో లభించే ఎగ్ ఇంక్యుబేటర్లు చాలా ఖరీదైనవై యుండి, కరెంటుతో పనిచేసేలా






ఉంటాయి. గ్రామీణ ప్రాంతాలలో తరచూ కరెంటు సమస్యలు తలెత్తుతూ వుండటం వలన అంత ఖరీదు పెట్టి కొనటానికి చాలామంది వెనకాడుతూ వుంటారు.

ఈ సమస్యను పరిష్కరించటానికి అస్సాం రాష్ట్రానికి చెందిన 'మిలాన్ జ్యోతి దాస్' అనే మహిళా రైతు ఒక ఎగ్ ఇంక్యుబేటర్‌ను రూపొందించింది. ఇది చాలా చవకగా లభించటమే కాకుండా, కరెంటుతోను, కరెంటు లేని సమయాల్లో కిరోసిన్ దీపంతో పని చేస్తుంది.

**పరికరం :**

ఈ పరికరాన్ని ఒక చెక్క డబ్బాలో, వేడిని నియంత్రించటానికి 10 సెం.మీ. మందం గల థర్మాకోల్‌తో గోడలను ఏర్పాటు చేసి, వాటిపైన పలుచని రేకును అతికించింది. ఈ డబ్బాలో పైన ఒకటి, క్రింద ఒకటిగా రెండు అరలను ఏర్పాటు చేసింది. పై అరలో ఒక ట్రేలో గుడ్లను ఉంచాల్సి వుంటుంది. ఈ అరను కొంతవరకు నీటితో నింపి, ఆ నీటిలో మరో ట్రేలో పొదగ వలసిన గుడ్లను ఏర్పాటు చేస్తారు. ఇందులో అవసరమైనంత తేమ అందుబాటులో వుండేలా ఏర్పాటు చేసింది. క్రింది అరలో వేడి పుట్టించటానికి తగిన ఏర్పాటు చేసింది. వేడి తగ్గిపోతే ఒక గంట మోగేలా కూడా ఏర్పాటు చేయబడింది. ఈ క్రింది అరలో వేడిని పుట్టించటానికి కరెంటు ఉన్నపుడు బల్బు వెలిగించడం, లేనపుడు కేవలం ఒక కిరోసిన్ దీపం ఏర్పాటు చేస్తే పైనున్న అరకి, క్రింది అరకి మధ్యనున్న రెండు పొరలుగా వున్న పలుచని రేకు వేడెక్కి పై అరలోకి కావలసిన వేడిని అందిస్తుంది.

వేడిని నియంత్రించేందుకు బల్బు వెలుగును ఎక్కువ– తక్కువ చేసేందుకు మామూలు ఫ్యానుకు వాడే రెగ్యులేటర్‌ను ఉపయోగించడం జరిగింది. పై అరలోని నీరు గుడ్లు పొదగడానికి అవసరమైనంత వెచ్చని తేమ గుడ్లకు అందటం ద్వారా గుడ్లు పొదగ బడతాయి. అవసరమైనంత గాలి బైటనుండి రావటం కొరకు క్రింది అరలో రెండుచోట్ల, పై అరలో రెండు చోట్ల రంధ్రాలు చేయబడి వాటికి ట్యూబులు అతికించి ఏర్పాటు చేయడమైనది.

**సాంకేతిక వివరాలు :**

❀ మొత్తం పరికరం బరువు 125 కిలోలు ఉంటుంది.

❀ ఈ పరికరం వెడల్పు 80 సెం.మీ., 1.5 మీటర్ల పొడవు, ఒక మీటరు ఎత్తు వుంటుంది.

❀ వేడిని ఉత్పత్తి చేయటానికి కరెంటు బల్బు లేదా కిరోసిన్ దీపాన్ని కూడా ఉపయోగించుకోవచ్చు.

❀ ఒకేసారి 500 గుడ్లను పొదగబెట్టవచ్చు.

❀ 85% శాతం గ్రుడ్లు పొదగబడతాయి.

**ముఖ్యాంశాలు :**

❀ పొరపాటున మూత తెరుచుకోవటం లేదా కరెంటు పోయినా వేడి ఎక్కువైనా, తగ్గినా తేమ శాతం పెరిగినా, తగ్గినా అలారం మోగే ఏర్పాటు చేయబడింది.

❀ విద్యుత్ సరఫరా ఆగిపోయినపుడు కిరోసిన్ దీపం కూడా వాడుకునే సదుపాయం వుంది కనుక ప్రత్యేకించి జనరేటర్ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం వుండదు. ●

**వివరాలకు సంప్రదించండి:**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్: 9652801700**

# పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**



**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.**

**ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**

<u>'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :</u>

**77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.**

**ఫోన్ : 040-49253096, సెల్ : 96528 01700.**

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి




గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## పొలం లోని రాళ్ళను ఏరివేసే యంత్రంతో గ్రామీణ యువతకు ఉపాధి

కొన్ని పొలాలు భూమి ఆనవాళ్ళు కూడా కనపడకుండా రాళ్ళతో నిండి ఉంటాయి. అటువంటి పొలాల్లో పంట దిగుబడి బాగానే ఉన్నా, అందులో విత్తనం వేయాలన్నా, నారు విత్తనం లాంటివి నాటాలన్నా చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇటువంటి పొలాల్లో పని చేయటానికి కూలీలు కూడా సుముఖత చూపించరు. భూమిని సేద్యం చేయాలన్నా కూడా సాధారణంగా రెండు మూడు సంవత్సరాలు పనిచేసే గడెం సామాన్లను ప్రతి సంవత్సరం పదును పెట్టుకోవాల్సి వస్తుంది. ఈ సామాన్ల అరుగుదల కూడా ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి పొలాల్లో రాళ్ళను ఏరివేయించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఈ సమస్య పరిష్కారానికి ఒక చక్కటి యంత్రాన్ని వెలుగులోకి తెచ్చింది 'పల్లెసృజన'. తెలంగాణకు చెందిన దీపక్ రెడ్డి ఈ యంత్రాన్ని ఆవిష్కరించారు.

ఈ పని చేయుటానికి సాధారణంగా మార్కెట్లో లభించే యంత్రాలు చాలా ఖరీదుతో కూడుకున్నవి. ఈ యంత్రం తక్కువ ఖరీదులో ఎక్కువ పనితనం ఉండేలా తయారు చేయబడింది. ఇది ట్రాక్టర్ అనుసంధాన యంత్రం. 55 హార్స్‌పవర్‌ల సామర్థ్యం కల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చేసుకుని పని చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ యంత్రం పొలంలోని రాళ్ళ మట్టిని సేకరించి, జల్లెడ పట్టి, ఎక్కడి మట్టి అక్కడే పడేస్తూ, రాళ్ళను మాత్రం అందులోనే ఏర్పాటు చేసిన ఒక ట్యాంకులోకి చేరుస్తుంది. పిడికిట్లో ఇమిడేంత సన్నటి రాయితో పాటు, 20 కేజీల బరువు వరకు వున్న అన్ని రకాల రాళ్ళను ఏరివేస్తుంది. పొలంలోని మట్టి ఏమాత్రం బయటకు వెళ్ళకుండా ఎక్కడి మట్టి అక్కడే పడిపోయేలా జల్లెడ పట్టి పొలంలోనే పడేస్తుంది. భూమిని కొద్దిగా లోతుగా త్రవ్వే విధంగా ఒక బ్లేడు ఏర్పాటు చేయబడి



వుంటుంది. అలా త్రవ్విన మట్టిని యంత్రం సేకరించుకుని జల్లెడపట్టి, అక్కడే పొలంలో వేస్తుంది. వేరు చేసిన రాళ్ళలో ఇంకా ఏమైనా మట్టి మిగిలి వుంటే దాన్ని మరో కన్వేయర్ బెల్టుపైకి చేరుస్తుంది. అలా చేర్చటం వల్ల ఇంకా ఆ రాళ్ళలో ఏదైనా మట్టి ఉంటే అది కూడా భూమిపైన పడేలా చేస్తుంది. అంటే రెండు దఫాలుగా సేకరించిన మట్టిని జల్లెడ పట్టి, కేవలం అందులోని రాళ్ళను ఒక కన్వేయర్ బెల్టు ద్వారా యంత్రంలో ఏర్పాటు చేసిన ఒక ట్యాంకులోకి చేరుస్తుంది. అంటే పొలంలోని మట్టి ఏమాత్రం నష్టం జరగకుండా పొలంలోనే ఉండేలా చేస్తుంది. అలా యంత్రంతో సేకరించిన రాళ్ళను రైతుకు అవసరం అనుకుంటే పొలం గట్టునే వేసుకోవచ్చు, అవసరం లేదు అనుకుంటే వాటిని ఒకచోటకు చేర్చుకుంటే ఎవరైనా గృహనిర్మాణం చేసుకునే వాళ్ళు తమ ఇంటి పునాది కోసం వీటిని కొనుగోలు చేస్తారు కాబట్టి అలా ఆ రాళ్ళ ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చు.

ఇలా పొలంలోని రాళ్ళను తీసివేయటం వల్ల పొలం శుభ్రంగా కనపడటంతో పాటు, పొలంలో రాళ్ళవల్ల జరిగే నష్టాలను అరికట్టవచ్చు. సాధారణ భూమిలో లాగానే పొలం పనులు చేసుకుని పంటలు సాగు చేసుకోవచ్చు. ఇవి ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 8–10 యంత్రాల ను వినియోగ దారులకు అందించటంతో పాటు, తానే స్వయంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని, రైతుల పొలాల్లోని రాళ్ళను ఏరివేసేందు కు కిరాయికి పంపుతూ మంచి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాడు. ఇతను ఒక ఎకరం పొలంలో రాళ్ళను ఏరివేసేందుకు రూ. 2.5 నుండి 3 వేల వరకు కిరాయి తీసుకుంటాడు. ఈ యంత్రాన్ని ఉపయోగించి తమ పొలంలోని రాళ్ళను తీసివేయించుకున్న రైతులు తమకు ఎంతో మంచి ఉపయోగ కరంగా ఈ యంత్రం ఉందని అతన్ని అభినందిస్తున్నారు. ఇదే రాళ్ళను కూలీలతో ఏరివేయించి, వాటిని పొలం గట్టుకు చేర్చాలంటే సాధారణ రైతు భరించలేని ఖర్చు, పైగా చాలా సమయం, ఎక్కువ మంది కూలీలు, రాళ్ళను పొలం నుండి గట్టుకు చేర్చడానికి ఎద్దుల బండి లేదా ట్రాక్టరు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ఇది ఎంతో ఖర్చు, కాలయాపనతో కూడుకున్న పని. ఈ పనులన్నిటిని కేవలం ఒక్క ట్రాక్టరు డ్రైవరు మరియు ఒక సహాయకుడు మాత్రమే పొలంలోని రాళ్ళను శుభ్రంగా ఏరి పొలాన్ని సాగుకు అత్యంత అనువుగా తయారు చేస్తారు. ఎకరం పొలాన్ని కేవలం 2–3 గంటల్లోనే శుభ్రం చేస్తుందీ యంత్రం.

**కంద గడ్డలను తీయటానికి:**

అంతే కాకుండా రైతులు పండించే ఆలుగడ్డ మరియు ఇతర




భూమిలోపల వేర్ల నుండి దిగుబడి నిచ్చే కంద గడ్డలు, ఇతర కూరగాయలను కూడా ఈ యంత్రంతో సులభంగా తక్కువ ఖర్చుతో నాణ్యంగా బయటికి తీయించుకోవచ్చు. ఆలు, క్యారెట్, తీపి కంద (గెన్సు గడ్డ) లాంటి కూరగాయలను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో నూర్పిడి చేసుకోవచ్చు.

కాబట్టి గ్రామీణ యువకులు, ముఖ్యంగా ట్రాక్టర్ కిరాయికి నడుపుతున్న వారు, ఆయా ప్రాంతాల్లోని పొలాల్లో ఎక్కువ రాళ్ళు ఉన్నాయి అనుకునే వారు ఈ యంత్రాన్ని కొనుగోలు చెయ్యటం ద్వారా మీ ప్రాంతంలోని పొలాల్లో వున్న రాళ్ళను ఏరివేయటం, పొలాలను శుభ్రం చేయటం, ఏరిన రాళ్ళను గృహ నిర్మాణదారులకు అమ్ముకో వటం, కంద, క్యారెట్ ఆలుగడ్డ లాంటి పంటలను నూర్పిడి చేయటం ద్వారా లాభదాయకమైన ఉపాధి పొందవచ్చు.

ఈ యంత్రాలను రెండు రకాల్లో తయారు చేశాడు దీపక్ రెడ్డి. ప్రస్తుతం వీటి ధర పెద్ద యంత్రం రూ. 7 లక్షలు కాగా, చిన్న యంత్రం 5.5 లక్షల ఖరీదుకు అందిస్తున్నాడు. మీ ప్రాంతాల్లో రాళ్ళ పొలాలు ఉన్నట్లయితే, వెంటనే మీకు అనువైన యంత్రాన్ని కొనుగోలు చేసి మీ ట్రాక్టరుతో అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. మీకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు 'పల్లెసృజన' ఎప్పుడూ మీకు తోడుగా ఉంటుంది.

యంత్రం కావాలనుకున్న వారు సంప్రదించండి :

**వీర రాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/సుభాష్, 9652801700**



విశేషాలు

# నవంబర్- డిశంబర్ 2024 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు





2024 నవంబర్ 4 నుండి 15వ తేదీ వరకు 'ప్రగతి సెంట్రల్ స్కూల్' కూకట్‌పల్లి, హైదరాబాద్ నుండి 9-10 తరగతి విద్యార్థులు 560 మందివల్లె సృజన కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది. రోజుకు 50 మంది విద్యా విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయుల 26 కిలోమీటర్ల దూరం నుండి హాజరయ్యారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మకత ఆలోచనలను వెలికి తీసే కార్యక్రమంలో భాగంగా, గ్రామీణ ప్రాంతాల్లోని ఆవిష్కరణలను గూరించి తెలునుకోవడం కోనం వారు ఈ కార్యక్రమానికి రావడంజరిగింది.






11 నవంబర్, 2024న హైదరాబాద్, హయత్ నగర్ లోని "లిటిల్ స్టార్ స్కూల్" కు చెందిన 56 మంది విద్యార్థులు, 6గురు ఉపాధ్యాయులు పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది. గ్రామీణ స్థాయిలో అనేక రకాల ఇన్నోవేషన్లను ఆవిష్కరించిన ఇన్నోవేటర్ల కథనాలను తెలుసుకుని, వ్రారి సూర్తితో విద్యార్థులు ఇలాంటి ఇన్నోవేషన్లు చేయాలనే ఉత్సుకత చూపి, ముదుకు వస్తారని ఈ కార్యక్రమ ఏర్పాటు చేయడం జరిగింది.










26 నవంబర్, 2024న నాగపూర్‌లో జరిగిన 15వ 'అగ్రోవిజన్ ఇండియా-2024' కార్యక్రమంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డా. మోహన్ యాదవ్ మరియు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీలతో పాటు మన పల్లెసృజన ఇన్నోవేటర్ గొర్రె అశోక్ కూడా పాల్గొనటం జరిగింది. వారిద్దరూ మన ఇన్నోవేటర్ అశోక్‌ను గురించి, మన పల్లెసృజన చేస్తున్న కార్యక్రమాలను గురించి తెలుసుకుని అభినందించారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తోంది పల్లెసృజన కుటుంబం.




2024 నవంబర్ 29-30 తేదీల్లో హైదరాబాద్ లో జరిగే పట్టణ జీవవైవిధ్యంపై జాతీయ సదస్సుకు అధ్యక్షత వహించడానికి పల్లెసృజనను ఆహ్వానించడమైనది.





14 డిశంబర్, 2024న గ్రామ భారతి సిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "మూల సంత" ప్రదర్శన కార్యక్రమం మర్రి కృష్ణ హాల్, తార్నాక నందు జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లెసృజన పాల్గొని ఇరవై ఇన్నోవేషన్లు ప్రదర్శించడం జరిగింది.










2024 డిశంబర్ 25-26 తేదీలలో ఢిల్లీలో "ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్" వారి ఆహ్వానం మేరకు 'గొర్రె అశోక్, మెండె శ్రీనివాస్, అల్లాడి ప్రభాకర్ మరియు ప్రవీణ్ కుమార్'లు పాల్గొని తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. మన పల్లెసృజన ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావటానికి ఇదొక మంచి వేదిక కావడం 'పల్లెసృజన కుటుంబం'కి ఎంతో ఆనంద దాయకం. వీరి ఇన్నోవేషన్లు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాలని కోరుకుందాం.

# యువత అవగాహనకై ప్రకృతిలో లభించే చెట్ల పేర్లు
## సంస్కృతం మరియు తెలుగు భాషల్లో
**సేకరణ : పర్యావరణ వేత్త "కొమెర జాజి"**



మారుతున్న కాలమాన పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం నేటి యువతకు చాలా వరకు చెట్ల పేర్లు తెలియటం లేదు. వాటిని పిల్లలకు తెలియజేసే వారు కూడా కరువయ్యారు. ఈ విషయం అవగాహన చేసుకున్న పర్యావరణవేత్త "కొమెర జాజి" పల్లెసృజనకు తాను సంస్కతం మరియు తెలుగు లో సేకరించిన చెట్ల పేర్లను తెలియజేస్తున్నాడు. వీటిని మీ చిన్నారులచేత తప్పక చదివించండి. వీలైతే మీ పరిధిలో వారు అడిగిన చెట్లను చూపించండి. ఇలా చేయటం వల్ల ప్రకృతి పట్ల చిన్నారుల్లో అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో వారికి చెట్లపైన అవగాహన పెరిగి, పర్యావరణం రక్షించదానికి దోహద పడుతుంది. **- ఎడిటర్ (గత సంచిక తరువాయి)**

### చెట్ల పేర్లు

| వ. సం. సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|
| 149. కుందరుకి | - | అందుగ చెట్టు |
| 150. కుందురు | - | పిరంగి సాంబ్రాణి |
| 151. కుంభికా | - | తూటికూర |
| 152. కుకన్ధ | - | కుక్క పుగాకు |
| 153. కుచందన | - | రక్త చందనము |
| 154. కుటజ | - | కొడిసేపాల చెట్టు |
| 156. కుణంజర | - | దొగ్గిలి కూడ |
| 157. కునటి | - | మణిశిల |
| 158. కుభే రాక్ష | - | గచ్చకాయ |
| 159. కుజ్జలీ | - | చామంతి చెట్టు |
| 160. కుముద | - | తెల్ల కాలువ గెడ్డ |
| 161. కురంటక | - | ముళ్ళ గోరింట |
| 162. కురువక | - | ఎర్రపువ్వుల గోరంట చెట్టు |
| 163. కుర్కు రికా | - | కుక్కుపాల |
| 164. కుష్ట | - | చెంగల్వ కోష్ఠ |
| 165. కుష్ట వైరి | - | నీరుతి విత్తులు |
| 166. కుసుంభ | - | కుసుంబా చెట్టు |
| 167. కూష్మాండకి | - | బూడిద గుమ్మడి |
| 168. కృత వేతన | - | చేదు బీర చెట్టు |
| 169. కృష్ణ కాంభోజి | - | నల్ల పురుగుడు |
| 170. కృష్ణ కుండలి | - | నల్ల ఉప్పి |
| 171. కృష్ణ కుటజ | - | అంకుడు చెట్టు |
| 172. కృష్ణ ఖదిర | - | నల్ల చంద్ర |
| 173. కృష్ణ చిత్రక | - | నల్ల చిత్రమూలం |
| 174. కృష్ణ జీరక | - | నల్ల జీలకర్ర |

| వ.సం. సంస్కృతం | - | తెలుగు |
|---|---|---|
| 175. కృష్ణ తులసి | - | కృష్ణ తులసి |
| 176. కృష్ణ త్రివృత్ | - | నల్ల తెగడ |
| 177. కృష్ణ దత్తూర | - | నల్ల ఉమ్మెత్త చెట్టు |
| 178. కృష్ణ నింబ | - | కరి వేప చెట్టు |
| 179. కృష్ణ పతంగిని | - | నల్ల పురుగుడు |
| 180. కృష్ణ పాలఫల | - | వాక చెట్టు |
| 181. కృష్ణ పుష్పక | - | నల్ల ఉమ్మెత్త |
| 182. కృష్ణ బీజ | - | కుంకుమ చెట్టు |
| 183. కృష్ణ బృంగరాజ | - | నల్ల గుంటగలగర |
| 184. కృష్ణ సారి | - | నల్ల చంద్ర |
| 185. కేకి శిఖ | - | మయూర శిఖ |
| 186. కేతకి | - | మొగలి పువ్వు |
| 187. కేశరాజ | - | గుంట గలగర |
| 188. కేశ హంత్రి | - | జమ్మిచెట్టు |
| 189. కైవర్త | - | తుంగముస్తలు |
| 190. కొంక నదూపం | - | ఫిరంగి సాంబ్రాణి |
| 191. కొక నద | - | ఎర్ర కలువ దుంప పువ్వు |
| 192. కోకిలాక్ష | - | నీరుగోబ్బి చెట్టు |
| 193. కోటరీ పుష్ప | - | వృద్ధ దారు |
| 194. కోలమూల | - | పిప్పలి మూలము |
| 195. కోవి దార | - | కాంచన వృక్షము |
| 196. కోశాతకి | - | బీరకాయ |
| 197. కోశామ్ర | - | కొండ మామిడి కాయ |
| 198. క్రకచిక | - | గచ్చకాయ |
| 199. ఖండ పుంఖాములు | - | వెంపలి చెట్టు |

| వ.సం. సంస్కృతం | – తెలుగు |
|---|---|
| 200. ఖదిర | – చంద్ర చెట్టు |
| 201. ఖడ్గ శింబ | – చమ్మకాయ |
| 202. ఖరపత్ర | – టేకు చెట్టు |
| 203. ఖర మంజరీ | – ఉత్తరేణి |
| 204. ఖర స్కంద | – మొరలి పండు |
| 205. ఖర్చుర | – ఖర్జూరపు చెట్టు |
| 206. ఖస్ తిల | – పోస్తుకాయ |
| 207. ఖాదిర | – కవిరి |
| 208. గండ గాత్రి | – శీతాఫల చెట్టు |
| 209. గంధనాకులీ | – దుంప రాష్ట్రము |
| 210. గంధపత్ర | – వెలగ చెట్టు |
| 211. గంధమాంశీ | – గంధమాంసి |
| 212. గంధర్వ వాస్త | – చిట్టాముదపు చెట్టు |
| 213. గంధోత్కర | – దవణము |
| 214. గంభారి | – గుమ్ముడు చెట్టు |
| 215. గంభారి | – గుమ్ముడు చెట్టు |
| 216. గజ పిప్పలి | – గజ పిప్పళ్ళు |
| 217. గజచిర్భిట | – వెర్రిపుచ్చకాయ |
| 218. గజ కర్ణాలు | – సారకంద |
| 219. గణికా | – అడవి మొల్ల |
| 220. గణికా | – అడవి మొల్ల |
| 221. గని కారికా | – నెల్లి |
| 222. గర ఘనక | –అడవి గగ్గెర |
| 223. గర్జర | – గాజర గెడ్డలు |
| 224. గర్భకర | – పుత్ర జీవిచెట్టు |
| 225. గవేధుక | – అడవి గోధుమలు |
| 226. గాంగేరుకి | – జిబిలిక చెట్టు |
| 227. గిరి కర్ణికా | – తెల్ల దింటేన |
| 228. గుంజ | – గులివింద చెట్టు |
| 229. గుచ్ఛా ఫల | – నేపాళపు చెట్టు |
| 230. గుడూచి తీగ | – తిప్పతీగ |
| 231. గైరిక | – గైరిక |
| 232. గోదావల్లి | – పుల్ల బచ్చలి |
| 233. గొరక్ష కకటి | – బుడమ తీగ |
| 234. గోలోమీ | – తెల్ల గరిక |
| 235. గోశ్రేణి | – తంగేడు చెట్టు |
| 236. గోక్షుర | – ఎర్ర పల్లేరు |
| 237. గ్రంధిల | – చెర్రికూర |
| 238. గ్రామ కంద | – గ్రామ కంద |
| 239. గ్రామ్య కుంకుమ | – కుసుంబ చెట్టు |
| 240. ఘంటా | – తుత్తురు బెండ |
| 241. ఘంటారవ | – గలిగిచ్చ |
| 242. ఘ్రుత ధూపక | – పాలిట చెట్టు |
| 243. ఘోటికా | – పాయిల కూర |
| 244. చండాతక | – వాడ గన్నేరు |
| 245. చందన | – మంచి గంధము |

| వ.సం. సంస్కృతం | – తెలుగు |
|---|---|
| 246. చంద్ర వల్లరి | – సోమలత |
| 247. చంద్రికా | – పొటల గంది |
| 248. చంపక | – సంపెంగ చెట్టు |
| 249. చక్ర మర్ద | – తగిరస చెట్టు |
| 250. చక్ర వాస్తుక | – చక్రవర్తి కూడ |
| 251. చనక | – శెనగ చెట్టు |
| 253. చర్మార | – చెప్పు తట్టాకు చెట్టు |
| 254. చక్ష రణహాల | – ఒద్ది చెట్టు |
| 255. చాంగేరి | – పులి చంచలి |
| 256. చాంపేయ | – నాగ కేసరాలు |
| 257. చామంతి | – చామంతి చెట్టు |
| 258. చారు | – పద్మ కాష్టము |
| 259. చారు పర్ణి | – గోంతిమ గోరు చెట్టు |
| 260. చాహ | – తేయాకు |
| 261. చిత్రక | – చిత్ర మూలము |
| 262. చిరబిల్వ | – నెమలడుగు చెట్టు |
| 263. చిర్బిట | – బుడమ చెట్టు |
| 264. చీనా కర్కటి | – పందిరి దోసకాయ |
| 265. చీనీ | – ఫిరంగి చెక్క |
| 266. ఛీరికా | – వెన్నెవెదురు కూర |
| 267. చుక్రికా | – వెన్నె వెదురు కూర |
| 268. చూడామణి | – గురివింద చెట్టు |
| 269. చోరక | – గడ్డి ధవణము |
| 270. ఛత్ర వృక్ష | – ముచు కుందనము |
| 271. జంబీర | – నిమ్మపండు |
| 272. జంబు | – నేరేడు చెట్టు |
| 273. జటామాంసి | – జటా మాంశి |
| 274. జటావల్లి | – రుద్ర జడ చెట్టు |
| 275. జపా | – మందార చెట్టు |
| 276. జయపాల | – నేపాళము |
| 277. జలకంద | – కోవిల దుంప |
| 278. జల నిర్గుడీ | – నీరువావిలి చెట్టు |
| 279. జల పిప్పలి | – బొక్కెన చెట్టు |
| 280. జల బ్రహ్మి | – చిలకలకూర చెట్టు |
| 281. జల వేతస | – నీటి ప్రబ్బలి చెట్టు |
| 282. జలాశయ | – తెల్ల వట్టివేళ్ళు |
| 283. జలా సూక | – తామర దుంప |
| 284. జాతికోశ | – జాపత్రి |
| 285. జాతీ | – జాజి పువ్వు |
| 286. జాతీఫల | – జాజికాయ |
| 287. జాలకం | – అల్లి చెట్టు |
| 288. జంగినీ | – దుష్టపు చెట్టు |
| 289. జీమూతక | – దేవతాళ వృక్షము |
| 290. జీవంతి | – మనుబాల |

**(మరిన్ని వివరాలకు, తప్పు ఒప్పులకు 'జాజి' గారిని సంప్రదించండి**

**ఫోన్ : 9908411700**

**(వచ్చే సంచికలో మరికొన్ని చెట్ల పేర్లు)**



## 49వ జాతీయ శోధయాత్ర

# తూర్పు ఉత్తర ప్రదేశ్ నుంచి అసాధారణ సందేశం!

### ఉత్తర ప్రదేశ్ లోని బల్లియా మరియు ఘజీపూర్ జిల్లాలో 20-26 జూన్, 2023 తేదీల్లో జరిగిన శోధయాత్ర మొదటి భాగం

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

ఈ 49వ శోధయాత్రలో 33 మంది యాత్రీకులు ప్రశాంతమైన గంగానది తీరం గుండా ప్రయాణించారు. ఈ యాత్ర జరిగిన నెల రోజుల తరువాత ఆ ప్రాంతపు రైతులు భయంకరమైన వరదల బారిన పడ్డారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం జరుగుతుందని తెలిసింది. స్థానికులు ప్రతిసారీ అధికారుల నిర్లక్ష్యం, సామాజిక, ఆర్థిక భయాలు భరించరాని వేడి, ఆకస్మిక వరదలు, నిలకడ లేని మార్కెట్లు, ఇలా ఎన్నో సమస్యలున్నా వీటన్నిటినీ చాలా ధైర్యంగా ఎదుర్కొంటూ, విప్లవాత్మక బల్లియా ప్రజలనిపించుకొంటున్నారు. విపరీతమైన వేడి, ఆకస్మిక వరదలు వచ్చినా వారు తమ భూమిని, 'ప్రేమ భూమి' అని ఆప్యాయంగా పిలుచుకొంటారు.

33 మంది యాత్రీకులు బల్లియా జిల్లాలోని ముబారక్‌పూర్ నుంచి ఘాజియాపూర్ లోని జోగా మసాహిచా వరకు 68 కిలోమీటర్లు పాదయాత్ర చేసే క్రమంలో మార్గ మధ్యంలో అక్కడి ప్రజలలో తమ నిత్య జీవితములో ఎన్నో కొత్త ఇన్నోవేషన్‌లను గురించి తెలుసుకొని ఆచరించాలనే ఉత్సాహం కనిపించిది. ఈ యాత్ర 'లక్నో' లోని "స్వతంత్ర తైలం" సంస్థకి చెందిన 10 మంది యాత్రీకులు పాల్గొనటం విశేషం. రాజేష్ యాదవ్, డా. రాజకుమార్ రాయ్, మృత్యుంజయ భాయ్, జితేంద్ర రాయ్, దిబాకర్ రాయ్ తదితరులు సహకరించారు. ఈ యాత్రను హనీబీ నెట్‌వర్క్ నిర్వహించగా, స్రిష్టి, గియాన్ సంస్థల వారు సహాయ సహకారాలందించారు.

విచిత్రంగా చెకొస్లోవేకియా దేశంలో, ప్రాగ్ నగరంలో జరిగిన ఒక సంఘటన ఈ ప్రాంతంలో ఈ యాత్ర జరగటానికి కారణమైంది. ఇంతకు ముందే ఒక శోధయాత్రలో పాల్గొన్న కల్నల్ అక్షయ్ యాదవ్ అనే హనీబీ స్వచ్ఛంద కార్యకర్త ప్రాగ్ పట్టణంలో ఉదయం పూట కప్పు కాఫీ తాగి అక్కడ సర్వర్‌గా పని చేసే వ్యక్తి (వారిని ఆ దేశంలో 'బిరిష్ట' అంటారు) కి ధన్యవాదాలు చెప్పి బైటకి వస్తూ ఆరోగ్యకరమైన ఆహారాలు అన్న బోర్డు మీద "అవిశ" గింజలుండటం చూసి అది భారత దేశంలో తయారైనవి అని తెలుసుకొని, దానిపైనున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, భారత దేశంలో, ఉత్తర ప్రదేశ్ లోని ఘాజియాబాద్ ప్రాంతంలోని ఒక ఎఫ్.పి.ఓ.లో తయారైందని తెలుసుకొని దానిలో కనిపించిన ఒక ఫోన్ నెంబరుతో మాట్లాడగా, డా. రాంకుమార్ రాయ్ గారు పరిచయం అయ్యారు. ఆయన ఘజియాబాద్‌లో 'శివాన్స్' అనే ఎఫ్.పి.ఓ. నడుపుతున్నారనీ, వారు ఐరోపా మార్కెట్‌లో తమ ఉత్పత్తులని ప్రవేశ పెట్టడానికి పాటుపడుతున్నారని తెలుసుకుని వారిని కల్నల్ అక్షయ్ యాదవ్, హనీబీకి పరిచయం చేశారు. తరువాత 'స్రిష్టి' కి చెందిన చేతన్ పటేల్ ఆ ఎఫ్‌పిఓ వారి పొలాన్ని సందర్శించాడు. ఆ ప్రాంతంలో చాలా మంది ఇన్నోవేటర్లున్నారని తెలుసుకొని హనీబీ వారు తమ తదుపరి (49వ) శోధయాత్రను ఆ ప్రాంహతంలో డా. రాయ్ గారి సహకారంతో నిర్వహించాలని నిర్ణయించుకొన్నారు.

ఈ యాత్ర మొత్తం రోడ్డుకు ఇరువైపులా మొక్కజొన్న పట్టు (పై పొరలు ఉండే సన్నని దారాలలా ఉండేవి) యొక్క ఉపయో గాలను గురించి యాత్రీకులు చర్చించారు. దాని వలన ఉండే ఎన్నో ఆరోగ్య కరమైన ఉపయోగాలను అక్కడి స్థానికులకి చెప్పారు వారు కూడా దీనిని తేనీరులా చేసుకొని త్రాగి చాలా ఆరోగ్యమైనదిగా చెప్పగా, కథైలా ప్రాంత స్థానికులు కూడా తమకు తెలిసిన విషయం తాము వెదురు ఆకులతో టీ కాచుకుని త్రాగితే చాలా మంచిదని చెప్పాడు. కబీంద్రనాథ్ యాదవ్ అనే రైతు అయ్యో ఇంత విలువైన మొక్కజొన్న పొట్టుని వ్యర్థంగా భావించి పడేస్తున్నాము ఇన్నేళ్ళు అని వాపోయాడు.

ఇతరులు ఆ ప్రాంతంలో విరివిగా కాలువల ప్రక్కన మొలిచే ఊదా రంగు పూలు పూసే 'ఇపోమియా కర్నియా' చెట్టు (దీనినే మన దగ్గర రబ్బరు చెట్టు, లొట్టపీసు చెట్లు, పాల సముద్రపు చెట్లు అంటారు) ఉపయోగించి పంటలకి పట్టిన చీడను నివారించవచ్చు. అని చెప్పగా





విని చాలా ఆశ్చర్యపోయారు. తరువాత తెలిసింది ధనేతా గ్రామంలోని రైతు పప్పు యాదవ్ మరియు బసానియా గ్రామంలోని రైతు రవీంద్ర ప్రజా పతులకి ఈ విషయం తెలుసునట. అరే ఇంతకాలం మేము ఈ విషయం తెలిసి కూడా ఎవ్వరికీ చెప్పలేదని బాధ పడ్డారు. ఈ చెట్టును చిన్న చిన్న ముక్కలుగా నరికి పంట నీటి కాలువలలో చల్లితే చీడ పీడలు రావట. ఈ విధంగా జరగటం ఇది మొదటిసారి కాదు. ఇంతకు ముందు 2000వ సవత్సరంలో రాజస్థాన్ లోని బన్సేవాడ ప్రాంతంలో జరిగిన ఇలాంటి మరో సంఘటన 5వ శోధయాత్రలో ఒక స్కూలు టీచరుకి ఎన్నో రకాల క్రిమి సంహారక మందుల గురించి తెలిసినా, వాటి గురించి ఎవ్వరికీ చెప్పలేదని తెలుసుకొని, అప్పటి యాత్రీకులు కారణం అడగగా ఎప్పుడూ సందర్భం రాలేదు. పైగా ఎవ్వరూ నన్ను అడగలేదు అన్నాడు.

23 సంవత్సరాల తరువాత కూడా పరిస్థితి అలాగే ఉంది. ఇక్కడ ఇందాక చెప్పిన పప్పు యాదవ్, రవీంద్ర భాయ్ లాంటి రైతుల దగ్గర విలువైన జ్ఞానం ఉన్నా, ఇతరులకి చెప్పే సదుపాయం, అవకాశం, ప్రేరణ, మాధ్యమాలు లేవు. కొందరికే తెలిసిన జ్ఞానాన్ని అందరికీ పంచటానికి హనీబీ (మన పల్లెసృజన) లాంటి సంస్థలు ఉన్నాయి. వీటిని వాడుకోవలి. ఇందాక ప్రస్తావించిన ఇపామోయా కార్నియా చెట్లను ఈ ప్రాంతంలో బేహయా (అనువాదిస్తే సిగ్గులేనిది అనొచ్చు) అంటారు. అతి తక్కువ చేమ ఉన్నా బతికిపోతుంది. మనం జ్ఞానాన్ని వితరణ చేసేటపుడు 'బేఫికర్' (ఏమాత్రం సంశయం లేకుండా) పని చెయ్యాల్సిన అవసరం ఉందేమో అనిపించింది.

మా గుంపులో ఉన్న డా. రాంకుమార్ రాయ్ యాత్ర మొత్తం రైతులతో సేంద్రియ సాగు పద్ధతుల గురించి చర్చించేవారు. స్థానికంగా దొరికే చెట్లు, ఆకులు, వైద్యానికి, సస్యరక్షణకి, చేతి పనులకి ఏ విధంగా పని చేస్తాయో చెప్పేవారు. 'జిల్లేడు' చెట్టు గాయలకీ, కీళ్ళ నొప్పులకి వాడతారు. ఇంకొందరు దాని పాలను, ముళ్ళు గుచ్చుకొన్న, గీరుకు పోయినా ఆ భాగంలో లేపనంలా వాడతారు. దాని దూదిని దిండ్లలో వాడితే పార్శ్వపు తలనెప్పి పోతుంది. చాలా మందికి ఈ విషయాలు తెలిసినా, ఆచరించరు. ఈ విషయాలు మాట్లాడుతుంటే పప్పు యాదవ్ తాను ఈ జిల్లేడు చెట్టు కొమ్మలని చిన్న చిన్న ముక్కలుగా చేసి, మిర్చి పంటకి నీరు పెట్టే కాలువలలో వదేస్తే పంటకు చీడ పీడ పట్టవని చెప్పాడు.





ఈ యాత్రలో మాకు తారస పడ్డ, మేము తెలుసుకొన్న కొన్ని విజ్ఞాన కణికలు .....

1. 'తమన్నాపుర' గ్రామానికి చెందిన హృదయానంద్ యాదవ్ 'ఆవ' నూనెలో తుమ్మ ఆకుల ముద్దను, చింతపండు, ఉల్లిపాయలు కలిపి కాగబెట్టి, చల్లారిన తరువాత వడకట్టి, విరిగిన ఎముకలకి కడితే త్వరగా అతుక్కుంటాయట.
2. ధనేత గ్రామానికి చెందిన జీతూరామ్ చెప్పిన దాని ప్రకారం పసి పిల్లలకి నత్తమాంసం పెడితే వారికి శక్తి బాగా వస్తుందట.
3. అమాన్ గ్రామానికి చెందిన ఆనంద రాయ్ చెప్పిన దాని ప్రకారం 1.5 కిలోల అర్జున పత్రాల ఆకులు, బెరడును 10 లీటర్ల నీటిలో మరిగించి, ఆ ద్రావకాన్ని కొంచెం కొంచెం సేవిస్తూ ఉంటే గుండె గట్టి పడుతుందట.
4. 'దౌలతాపూర్' గ్రామ నివాసి విజయ్ సింగ్ – 4 వావిలాకులను ఒకటిన్నర కప్పు నీటిలో మరిగించి, 21 రోజులు టీలా త్రాగితే విరిగిన ఎముకలు త్వరగా అతుక్కుంటాయంటాడు.
5. పండేపురా అమీర్‌పూర్‌కు చెంది వ్యక్తి మీనాదేవి, ఆకు చెముడు ఆకులను ముద్ద చేసి ఉప్పు కలిపి చిన్న పిల్లలకి తినిపిస్తూ వుంటే దగ్గు, జలుబు తగ్గిపోతాయట.
6. ధనేత గ్రామానికి చెందిన జై నారాయణ్ యాదవ్ ప్రకారం పొడపత్రి ఆకు కషాయాన్ని పశువులచేత త్రాగిస్తే వాటి ముక్కుల నుంచి నోటి నుంచి నీరు, నెత్తురు కారటం ఆగిపోతుందట.
7. కానియాన్ గ్రామ వాసులు జిల్లేడు పాలను కాలి గోళ్ళపై పూస్తే, కంటి జబ్బులు నయమౌతాయని చెప్పారు.
8. పండేపురా అనరాపూర్ గ్రామంలోని కామశేష్ రాజ్‌బరే 2 లీటర్ల జన్ను పాలలో 250 గ్రా. ఉప్పు కలిపి పశువు చేత తాగిస్తే గర్భస్త మాయ త్వరగా బైటకు వస్తుందట.
9. గొడీఖాస్ గ్రామంలోని తారకేశ్వర్ కుష్వ ప్రకారం గరికను నీటిలో ఉడకబెట్టి, పచ్చి పసుపు, జిల్లేడు పాలను కలిపి వడకట్టి త్రాగితే కడుపులోని అల్సర్ తగ్గిపోతుందట. జ్వరం తగ్గటానికి తుమ్మ చెట్టు బెరడు నీటిలో ఉడికిచి, ఆ నీరు త్రాగితే చాలునట.
10. గొడేఖాస్ గ్రామ నివాసి మున్నా యాదవ్ చెప్పిన దాని ప్రకారం నాగజెముడు ముళ్ళను కాల్చి, నీటిలో కలిపి తీసుకొంటే వాపులు తగ్గుతాయట.
11. ఖార్దియా గ్రామ వాసులు అభిషేక్ రాజ్ మరియు ఉమాకాంత్ రాజ్‌లు చెప్పిన దాని ప్రకారం ఉత్తరేణి చెట్టు కాడలతో పళ్ళు తోముకోవడమే కాక, దీని గింజలు వేయించి తింటే విరోచనాలు తగ్గుతా యట. ఈ చెట్టు వేళ్ళు తేలు కాటుకి ఔషదంలా పని చేస్తుందట. (సశేషం)

# 'అడవి పుత్రుడు' కొమెర జాజి కి దక్కిన అరుదైన గౌరవం

## జాజికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు


అంకారావు (ఫైల్)

కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి రాజస్థాన్ రాష్ట్రం గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రకటించింది. నల్లమల అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుతూ పక్షులకు ఆహారం అందించడానికి తన సొంత పొలంలో ఆహార ధాన్యాలను పండించి వాటి ఆకలి తీరుస్తున్న అంకారావు అడవి బిడ్డగా పేరొందారు. అంకారావుకు గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రకటించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



Meet Andhra's Forest Man

For 30 years, 42-year-old Komera Anka Rao – or Jaji, as he is better known – has been tirelessly tending to the Nallamala forest, of which the Nagarjunsagar-Srisailam Tiger Reserve is a part, to add to its green cover

'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన 'అడవి పుత్రుడు' కొమెర జాజికి ఇటీవల అరుదైన గౌరవం దక్కింది. దేశంలో ప్రఖ్యాతి గాంచిన రాజస్థాన్‌కు చెందిన 'శ్రీ కల్పతరు సంస్థాన్' వారు కొమెర జాజిని "గ్రీన్ ఐడల్" పురస్కారానికి ఎంపిక చేయటం జరిగింది. అలాగే దేశంలోని ప్రముఖ ఆంగ్ల దినపత్రిక "టైమ్స్ ఆఫ్ ఇండియా" జాజిని గురించి "ఫారెస్ట్ మ్యాన్" బిరుదుతో గౌరవించి, తమ పత్రికలోని ప్రధాన పేజీలో ఆయన అడవి కొరకు చేస్తున్న విశిష్ఠ సేవలను కొనియాడింది. దేశ వ్యాప్తంగా ఇంతటి ఘనకీర్తిని సాధిస్తున్న జాజికి మరిన్ని గౌరవాలు దక్కాలని, సమాజం ఆయన దృక్పథాన్ని అమలు చేయాలని కోరుకుంటోంది 'పల్లెసృజన కుటుంబం'.

- ఎడిటర్

# వెంట్రుకలు రాలకుండా ఆపే 'భృంగరాజ తైలం' మీరే తయారు చేసుకోవచ్చు

కాల ప్రభావమో, ప్రస్తుతం రైతులు వినియోగిస్తున్న విపరీతమైన రసాయన ఎరువులు, మందుల ప్రభావమో తెలియదు కానీ, చాలా మంది యువతీ యువకులకు, వయోవృద్ధులకు విపరీతంగా జుట్ట రాలటం, జుట్టు తెల్లగా మారటం జరుగు తోంది అన్న విషయం అందరికీ తెలిసిందే. అటువంటి వారిని లక్ష్యంగా చేసుకుని మార్కెట్‌లో రకరకాల తల నూనెలు, షాంపూలు, తలకు వేసుకునే రంగుల విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. అందులో కూడా కొన్ని రకాల రసాయనాలు కలపటం వల్ల అవి కొందరి శరీరాలకు ఒంటబట్టక అవి వికటిస్తున్నాయి. మరి కొందరు ఆయుర్వేద అనుభవజ్ఞులు కూడా కొన్ని రకాల ఆయుర్వేద తైలాలను విక్రయిస్తున్నారు. వాటిని ఎంతవరకు నమ్మాలో కూడా కొందరికి అర్థం కావడం లేదు.



ఈ సమస్య పరిష్కారానికి పల్లెసృజన ఇన్నోవేటర్ తెలంగాణ లోని వరంగల్ జిల్లాకు చెందిన 'ముప్పారపు రాజు' ఒక ప్రయోగం చేసి, తాను ఉపయోగించుకున్న తర్వాత అది బాగా పని చేస్తోందని తెలుసుకుని ఈ 'భృంగ రాజు తైలం' తయారు చేసుకునే విధానాన్ని పల్లెసృజన పాఠకులకు అందిస్తున్నాడు.

భృంగరాజ మొక్కలు గ్రామా ల్లో బీడు భూములు, పొలం గట్ల వెంట, ముఖ్యంగా వరి మళ్ళ గట్లమీద విరివిగా లభి స్తాయి. ఈ ఆకులను సేక రించి తెచ్చుకుని, వాటిని రోట్లో వేసి కొద్దిగా దంచు కోవాలి. ఆ తర్వాత ఆ ఆకుల ముద్దను ప్రక్కన ఉంచుకుని, ఒక పాత్రలో అవసరమైనంత కొబ్బరి నూనె తీసుకుని, పొయ్యి మీద పెట్టి బాగా మరగ నివ్వాలి. నూనె మరుగుతున్న సమయంలో ముందు గా దంచి పెట్టుకున్న బృంగ రాజు ఆకుల ముద్దను ఆ నూనెలో వేసి, మరికొంత సేపు బాగా మరి గించాలి. ఆ తర్వాత ఆ నూనె పాత్రను ప్రక్కన పెట్టి అది చల్లారే దాకా కొద్దిసేపు వేచి ఉండాలి. బాగా చల్లా రిన తర్వాత ఆ నూనెను ఒక గుడ్డలో వేసి, వడకట్టి ఆ నూనెను ఒక గాజు సీసాలో (వీలైతే) భద్రపరచుకొని, ప్రతిరోజూ తలకు రాసుకుంటూ ఉన్నట్లయితే, జుట్టు రాలే సమస్య చాలా వరకు తగ్గుముఖం పడుతుంది.



అతే కాదు పెరిగే కొత్త జుట్టు కూడా కొంత కాలానికి నల్లబడే అవకాశం కూడా మెరుగ్గా ఉంటుంది అటున్నాడు ముప్పా రపు రాజు.

పాఠకులు మార్కెట్‌లో లభించే తైలములను కొనుగోలు చేసి, అనుమానాలతో తలకు రాసుకునే బదులు వారే స్వయంగా 'భృంగరాజు తైలము' తయారు చేసుకొని మీ జుట్టు ఆరోగ్యంగా పెరిగేలా చేసుకోవాలని కోరుతోంది 'పల్లెసృజన'.

ఇన్నోవేటర్ ముప్పారపు రాజు, ఫోన్ : 95028 55858

# పల్లె జ్ఞానం

## కానుగపప్పు ద్రావణం

- జట్టు ఆశ్రమం వారి సౌజన్యంతో

**తయారు చేసే పద్ధతి:**

నీడలో బాగుగా ఎండిన కానుగ గింజలనుండి తీసిన 5 కిలోల పప్పును 10 లీ. నీటిలో నాలుగు గంటలపాటు నానబెట్టాలి. ఆ తరువాత కానుగ గింజలపప్పును మెత్తగా రుబ్బి, ఒక మూటలో కట్టి ఆ మూట నీటిలో మునిగే వరకు నీటిని నింపి ఒక రాత్రంతా నానబెట్టాలి. అలాగే మరో చిన్న పాత్రలో పావు కిలో కుంకుడు కాయలు తీసుకుని, వాటి మూతులను రాయితో పగలగొట్టి, తగినంత నీటిలో రాత్రంతా నానబెట్టాలి. ఉదయం కానుగ పప్పు మూటను నీటిలో మూటను ముంచి, తీస్తూ, మూటను చేతితో 15 నుంచి 20 నిమిషాలపాటు పిండుతూ ద్రావణం తీయాలి. ఈ ద్రావణం ఘాటైన వాసనతో పాలలాగ వుంటుంది. అలాగే రాత్రి నీటిలో నానబెట్టిన కుంకుడు కాయలను ఉదయమే చేతితో మెత్తగా పిసుకుతూ కుంకుడు కాయల ద్రవాన్ని తయారు చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని కానుగ ద్రావణంలో కలపాలి. ఆ తర్వాత మొత్తం ద్రావణాన్ని ఒక పలుచని గుడ్డతో వడపోసి పొలానికి తీసుకు వెళ్ళాలి. ఈ విధంగా తయారైన ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి పంటపై సాయంత్రంపూట పిచికారి చేయాలి. పంట దశను బట్టి, పురుగులఉధృతిని బట్టి కానుగ కషాయం మోతాదు పెంచుకోవాలి.

**నివారింపబడు పురుగులు:**

రసం పీల్చే పురుగులు, ఆకుముడత పురుగులు, పొగాకు లద్దె పురుగు, పచ్చ పురుగు, ఆకు నమిలే పురుగు.

పనిచేసే విధానం :

1. పురుగు గుడ్డుదశలో పంటపై పిచికారి చేస్తే పురుగు గుడ్డును పొదగకుండా అది చెడిపోతుంది.
2. పురుగు లార్వా దశలో పిచికారి చేస్తే అది ఆహారం తినడం మానివేసి నెమ్మది నెమ్మదిగా చనిపోతుంది.
3. లార్వాదశ నుండి ఇంకొక దశకు అభివృద్ధి చెందకుండా చేస్తుంది.
4. ప్యూపా దశనుండి రెక్కలపురుగు (తల్లిపురుగు) విడుదలకాకుండా చేస్తుంది.

**సూచన:**

నీడలో బాగా ఎండిన కానుగ గింజలపొడిని కషాయం తయారు చేయడం కోసం ఉపయోగిస్తే పంట ఎత్తును బట్టి ఎకరాకు 10నుండి15 కిలోలకానుగపొడి అవసరం పడుతుంది.

**కానుగ గింజలు వినియోగం తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. చెట్టునుంచి రాలిన కానుగ పిక్కలను సేకరించాలి.
2. కానుగ గింజలను ఎప్పటికప్పుడు పప్పును వేరుచేసి నిలువ చేయాలి.
3. కాను గింజలను నీడలోనే ఆరనివ్వాలి.
4. కానుగ గింజలను, పలుచటి గోనెసంచులలో గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిలువ చేసుకోవాలి..

ఈ విధంగా జాగ్రత్త చేసిన కానుగ గింజలు ఒక సంవత్సరం వరకు ఉపయోగపడతాయి.







**కానుగపప్పుద్రావణం వల్ల లాభాలు:**

1. పంట పూత దశలో ద్రావణం పిచికారి చేస్తే తల్లిపురుగులు కానుగ వాసనకి పంటపై గుడ్లు పెట్టవు.
2. కానుగ ద్రావణం చల్లిన ఆకులు చేదుగా ఉండటం వలన పిల్ల పురుగులు (లార్వాలు) ఆకులను తినలేవు.
3. కానుగ పప్పు ద్రావణం పురుగు గుడ్డు దశమీద, పిల్ల పురుగులదశమీద బాగుగా పనిచేస్తుంది.
4. కానుగలో ఉండే "కరంజన్" అనే మూలపదార్థం పురుగు జీవిత దశపై ప్రభావాన్ని చూపిస్తుంది.
5. కానుగ ద్రావణంలో వున్న అనేక "లిమోనాయిడ్స్" పంటను ఆరోగ్యవంతంగా ఉంచడానికి సహాయ పడతాయి.
6. కానుగ ద్రావణం మానవులఆరోగ్యానికి, మిత్ర కీటకాలకు, పర్యావరణానికి ఎలాంటి హాని చేయదు.

**ఎన్నిసార్లు వాడాలి?:**

పంట దశను బట్టి పురుగులఉధృతిని బట్టి కానుగ ద్రావణాన్ని వాడవలసి వుంటుంది. ఈ ద్రావణాన్ని....

1. అన్ని పంటలలోను వాడవచ్చు.
2. వరి పంటలో ఒకటి నుండి రెండుసార్లు వాడవచ్చు.
3. మిరప, ప్రత్తి వంటి పంటలలో పురుగులతీవ్రతను బట్టి 3 నుంచి 4 సార్లు వాడవచ్చు.
4. వేరుశనగ, పొద్దుతిరుగుడు, కూరగాయలపంటలలో 1 నుంచి రెండుసార్లు వాడవచ్చు.
5. అపరాలలో ఒకటి నుంచి రెండుసార్లు వాడుకోవచ్చు.

**కానుగ ఇతర ఉత్పత్తులు:**

1. కానుగ నూనె, 2. కానుగ పిండి.

**గమనిక:**

కానుగ పప్పు, వేప పప్పువలెనే పనిచేస్తుంది. వేపలో గలఅన్ని గుణాలూ కానుగలోనూ ఉంటాయి.

## పొగాకు కషాయం

**ద్రావణం తయారు చేయు విధానం:**

1. పొగాకు రద్దు (కాడలు, ఉపయోగించని ఆకులు మొదలైనవి) ఒక కిలో తీసుకుని దానిని 10 లీ. నీటిలో అరగంటసేపు ఉడకబెట్టాలి.
2. ఉడుకుతున్న కషాయాన్ని మధ్యమధ్యలో ఒక కర్రతో కలియబెడుతూ ఉండాలి.
3. కషాయాన్ని బాగా చల్లార్చాలి.
4. చల్లార్చిన కషాయాన్ని పలుచని గుడ్డతో వడపోయాలి.
5. ఈ కషాయానికి 100 గ్రా. సబ్బుపొడి కలపాలి. పొగాకు ద్రావణాన్ని 100 లీ. నీటిలో కలిపి 1 ఎకరానికి సాయంత్రం పూట పిచికారి చేయాలి.

**నివారించబడు పురుగులు:**

పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, చిన్న చిన్న లార్వాలు.

**ఎలా పనిచేస్తుంది?:**

పొగాకులో సహజంగా ఉండే "నికోటిన్" మరియు ఇతర ఆల్కలాయిడ్‌లవలన ఈ కషాయం పురుగులనియంత్రణలో ఉపయోగపడుతుంది.

**సూచనలు:**

1. పొగాకు కషాయం పంటలలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే వాడాలి.
2. పంట కాలంలో ఒకసారి మాత్రం దీనిని వాడాలి.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. కుండలో ద్రావణాన్ని వేడిచేసేటపుడు ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి.
2. పొగాకు కషాయం పిచికారి చేసేటపుడు ఒంటిపై పూర్తిగా బట్టలు ధరించాలి.

## పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం తయారి

**ద్రావణం తయారు చేయు విధానం:**

1. మూడు కిలోలపచ్చిమిరపకాయలను కాడలు తీసి మెత్తగా నూరి దానిని 10 లీటర్ల నీటిలో ఒక రాత్రంతా నానబెట్టాలి.
2. అరకిలో వెల్లుల్లిపాయలను పొట్టుతీసి బాగా నూరి 250 మి.లీ. (పావులీటరు) కిరోసిన్‌లో ఒక రాత్రంతా నానబెట్టాలి.
3. మరునాడు మిరపకాయలద్రావణాన్ని పలుచని గుడ్డతో వడబోసి, ద్రావణాన్ని సేకరించాలి.
4. అదేవిధంగా కిరోసిన్‌లో నానబెట్టిన వెల్లుల్లిపాయలద్రావణాన్ని కూడా పలుచని గుడ్డతో వడపోసి ద్రావణాన్ని సేకరించాలి.
5. ఈ రెండు ద్రావణాలను కలపాలి.
6. దీనికి 75 గ్రాములసబ్బుపొడిని నీటిలో కలిపి ద్రావణం చేసి ఒక లీటరు ద్రావణాన్ని పై ద్రావణానికి కలపాలి.
7. ఈ మూడింటిని కలిపినచో పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం తయారవుతుంది.
8. ఈ ద్రావణాన్ని 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరం పొలంలో సాయంత్రం వేళ పంటపై పిచికారి చేయాలి.

**నివారింపబడు పురుగులు:**

శనగపచ్చ పురుగు, లద్దెపురుగు, దాసరి పురుగు, ఆకుచుట్టు పురుగు, తొలిదశలలో ఎర్రగొంగళి పురుగు.

**ఎలా పనిచేస్తుంది:**

ఈ ద్రావణం పిచికారి చేయడం వలన పచ్చిమిర్చిలో వుండే "కేప్ససిన్" మరియు వెల్లుల్లిలో ఉండే "అల్లెసిన్" కలిసి పురుగుకు ఒకరకమైన తిమ్మెర గుణాన్ని కలుగజేస్తుంది. దీనివలన చిన్న పురుగులు చనిపోతాయి. ఎదిగిన పెద్ద పురుగులు మొక్కలపై నుండి క్రిందపడి కొద్ది సమయంలో చనిపోతాయి.

**సూచన:**

పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం చాలా శక్తివంతమైన ద్రావణం. కనుక దీనిని అవసరాన్ని బట్టి పంటలలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రం పిచికారి చేసి సత్ఫలితాలు పొందవచ్చు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

1. ద్రావణాన్ని తయారు చేసేటపుడు ఒంటికి కొద్దిగా నూనెను రాసుకోవాలి.
2. పిచికారి చేసేటపుడు ఒంటిపై పూర్తిగా బట్టలు ధరించాలి.
3. చిన్న పిల్లలను ద్రావణాన్ని తయారు చేసేటపుడు మరియు పిచికారి సమయంలో దూరంగా ఉంచాలి.

**కషాయాలవినియోగం తీసుకోవలసిన కొన్ని సూచనలు:**

1. పై కషాయాలను పంటలలో వాడిన తరువాత 4 లేదా 5 వ రోజున పశువులపేడ - మూత్రంతో తయారు చేసిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. దీనివలన పంటకు వివిధ రకాలపోషకాలు సత్వరమే లభించి మొక్కలు ఆరోగ్య వంతంగా పెరుగుతాయి.
2. ఒకేరకం కషాయాలను ఎప్పుడూ వాడకూడదు.
3. కషాయాలను మార్చి మార్చి వాడుతూ మధ్యమధ్యలో పశువులపేడ - మూత్రం ద్రావణాన్ని (పంచగవ్య) పిచికారి చేయడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు.

**వివరాలకు జట్టు సభ్యులతో సంప్రదించండి : ఫోన్ : 9440899365**

## పచ్చిమిర్చి - వెల్లుల్లి ద్రావణం తయారి



## మీ సమస్య మా పరిష్కారం పరిధిలో
# చెఱకు రైతుకు పెట్టుబడి ఆదా చేసిన అల్లాడి ప్రభాకర్ 'చెఱకు కత్తిరించే యంత్రం'



- వీరరాఘవ రెడ్డి

పల్లెసృజన 5 సంవత్సరాల క్రితం ప్రారంభించిన "మీ సమస్య – మా పరిష్కారం" పరిధిలో మరో వినూత్న ఇన్నోవేషన్ రైతుకు చేరింది. దీని వివరాలు క్రింది కథనంలో ఉన్నాయి.

తెలంగాణ లోని మెట్‌పల్లికి చెందిన "అల్లాడి ప్రభాకర్" 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితులే. ఇప్పటికే ఎన్నోరకాల ఇన్నోవేషన్‌లను తన మేధస్సుతో తయారు చేసి ఎంతోమంది రైతులు మరియు ఇతర కష్టాలుపడుతున్న వారి శ్రమను, ఖర్చును మిగిలించారు. ఇప్పుడు తను మరో సృజనాత్మక రైతు సమస్యను తీర్చే ఒక ఇన్నోవేషన్ తయారు చేసి, అతనికి ఎంతో సమయాన్ని, కూలీల ఖర్చును మరియు వృధాను అరికట్టగలిగారు.

ఇక విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని రావుల పాలెంకు చెందిన 'వీరారెడ్డి' అనే సృజనాత్మక రైతు తను చెఱకు పండించి, దాన్ని మార్కెట్‌లో విక్రయించకుండా, తానే దాదాపు 25 చెఱుకు రసం తయారు చేసి విక్రయించే దుకాణాలను విజయవాడ – విశాఖ పట్నం రహదారిపైన ఏర్పాటు చేసి తన పంటతో ఉపాధి వచ్చేలా ఏర్పాటు చేసుకున్నాడు. వీరారెడ్డి చెఱకును పొలం నుండి కోసిన తర్వాత వాటిని ఒక చోటికి చేర్చడం, అక్కడ ఎంతోమంది కూలీలతో దాని వగడును వలిచి, పేరుకొని ఉన్న మరకలను శుభ్రంగా కడిగించి, దాన్ని రవాణాకు అనువుగా మరియు చెఱకు రసం తయారు చేసే బండిలో ఏర్పాటు చేసుకునే విధంగా దాన్ని ముక్కలు చేయడం, వాటిని ఒక వ్యానులో వేసి ఆయా చెఱకురసం కేంద్రాలకు పంపడం అతని దినచర్య.

ఈ పనులన్నీ చెయ్యాలంటే ఎంతోమంది కూలీలు అవసరం. ఇందులో చెఱకును ముక్కలుగా చేసేటపుడు కొంత చెఱకు వృధా అయిపోతుంది అని, పైగా వీటిని ముక్కలు చెయ్యటానికి బలమైన పురుషులు అవసరం. తనకు ఆదాయం బాగానే వస్తుంది కాబట్టి కూలీల ఖర్చును భరించడం అతనికి కష్టం కాదు. కానీ, కూలీల లభ్యత అతన్ని వేధిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం కావాలని పల్లెసృజన బృందాన్ని అడగటం జరిగింది (జనవరి–ఫిబ్రవరి 2023 సచికలో వీరారెడ్డి కథనం ప్రచురితమైంది). ఈ సమస్యకు పరిష్కారం మన ఇన్నోవేటర్ 'అల్లాడి ప్రభాకర్' తయారు చెయ్యగలడు, మీరు అతనితో మాట్లాడి మీ సమస్యను వివరించండి, వాటికి సంబంధించిన వీడియోలను కూడా పంపండి అని 'పల్లెసృజన' రైతును – ఇన్నోవేటర్‌ను సంధానం చేసింది.

వీరారెడ్డి చెప్పిన మాటలు, అతని వీడియోలను చూసిన అల్లాడి ప్రభాకర్ దీన్ని ఒక సవాలుగా స్వీకరించి, మీ సమస్యను తీర్చేందుకు తప్పక ఒక యంత్రాన్ని తయారు చేస్తాను అన్నాడు. ఈ విషయంపై తీవ్రంగా ఆలోచించి, సరైన పరిష్కారంగా ఒక చిన్న యంత్రాన్ని తయారు చేయాలి అనుకున్నాడు. మార్కెట్‌లో ఇలాంటి పరికరాలు లేవు. దాదాపు ఒక సంవత్సరం పాటు దీన్ని ఎలా తయారు చెయ్యాలి అని వీరారెడ్డి పంపిన వీడియోలను పరీక్షగా చూసి మొత్తానికి ఒక చిన్న యంత్రాన్ని తయారు చేశాడు.

ఈ యంత్రం లో ప్రధానమైనది చెఱకును కత్తిరించే కత్తి. అది చెఱకును నరికినప్పుడు మొద్దుబారటం లాంటివి అదేపనిగా జరగకూడదు. ఎందుకంటే ప్రతి సారి ఆ కత్తిని విడదీసి, దానికి పదును పట్టించి, మళ్ళీ బిగించటం లాంటి విసుగు వచ్చే పనులు ఉండకూడదు. అందుకే దాన్ని తయారు చెయ్యటానికి ఒక ప్రత్యేకమైన ఇనుము (స్టీల్) ఎంచుకున్నాడు. ఇలా చేయటం వల్ల ఇది మొద్దుబారే అవకాశాలు చాలా అరుదు. చెఱకును కత్తిరిచే మనిషికి ఎటువంటి ప్రమాదం జరగకుడా జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకొరకు చెఱకును యంత్రంలో ఎక్కడ కత్తిరించాలో అక్కడ పెట్టిన వెంటనే కత్తి దానంతట అదే వచ్చేలా ఒక సెన్సార్‌ను ఏర్పాటు చేశాడు. అవసరం అనుకుంటే ఆటోమేటిక్‌గా కాకుండా చేతితో స్విచ్ నొక్కడం ద్వారా కూడా కత్తిరించవచ్చు. దాన్ని ఉపయోగించే వ్యక్తి అవసరాన్ని బట్టి ఏర్పాటును మార్చుకునే విధంగా తయారు చేశాడు. ఈ యంత్రం ద్వారా చెఱకును ముందుగా అనవసరమైన భాగాన్ని కత్తిరించడం, ఆ యత్రంలో తాను ఎక్కడ కత్తిరించాలి

అనుకున్నాడో ఆ భాగాన్ని కత్తి వేటు పడేచోట పెడితే చాలు కత్తి దానంతట అదే వచ్చి చెఱకు చిట్లిపోకుండా ఒకే వేటులో కత్తిరించి వేస్తుంది. ఒకవేళ చెఱకులోఎక్కడైనా పుచ్చు ఉన్నట్లయితే ఆ పుచ్చిపోయిన భాగాన్ని కూడా కత్తిరించడం ద్వారా నాణ్యమైన చెఱకును రసం తీయటానికి పంపడం ద్వారా వినియోగ దారునికి నాణ్యమైన చెఱకు రసం అందుతుంది. ముఖ్యంగా చెఱకు పగులు అనేది రాకుండా పదునుగా కత్తిరించడం వల్ల రైతుకు నష్టం వాటిల్లదు.

ఈ యంత్రం ద్వారా గంటకు 1500 దాకా ముక్కలను కత్తిరించవచ్చు. ఇలా లక్షన్నర దాకా ముక్కలను కత్తిరించినా కత్తి మొద్దుబారే సమస్యే ఉండదు, అలాగే పదునుగా ఉంటుంది. ఈ యంత్రం 1 హార్స్‌పవర్ మోటారుతో నడుస్తుంది. ఈ యంత్రం తయారీ వల్ల చెఱకును నరకడానికి బలమైన వ్యక్తి అవసరం లేదు. మహిళలు కూడా దీనితో పని చేయించవచ్చు. ఇలా చేయటం వల్ల బలమైన పురుష వ్యక్తికి 7 నుండి 8 వందల వరకు కూలీకి ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా 3–4 వందల కూలీ ఖర్చుతో మహిళలతో పని చేయించుకొన వచ్చు. ఈ విధంగా చేయటం వల్ల రైతుకు వీటిని కత్తిరించే కూలీల సంఖ్య, ఖర్చు 50 శాతానికి పైగా మిగులుతోంది. పైగా మనిషి కత్తిరించేటపుడు చెఱకు చిట్లిపోవటం ద్వారా కొంత రసం రూపంలో నష్టం జరిగేది. ఇప్పుడు అలాంటి వృధా, నష్టాలు ఏమీ జరగటం లేదు. చెఱకు రసం పిండే యంత్రాల వద్దకు నాణ్యమైన చెఱకు అవసరమైన సైజుల్లో వెళుతోంది.

ఈ యంత్రం తయారీ వల్ల తనకు ఎంతో లాభం చేకూరడం వల్ల వీరారెడ్డి, ప్రభాకర్ కు మరో 3 యంత్రాలకు ఆర్డర్ కూడా ఇవ్వటం జరిగింది. వీటితో పాటు వీరారెడ్డి తన వ్యాపారంలో ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్య చెఱకును నీటితో శుభ్రం చేయటం దీని కొరకు పదుల సంఖ్యలో కూలీలను భరించాల్సి వస్తోంది. పైగా చాలా శ్రమతో కూడుకున్న పని కావటం వల్ల కూలీల లభ్యత కూడా చాలా తీవ్రంగా ఉంది. ఈ సమస్యను కూడా పరిష్కరించేలా మరో యంత్రాన్ని తయారు చెయ్యమని, అందుకు అవసరమైన బయానా డబ్బును కూడా ప్రభాకర్‌కు చెల్లించడం జరిగింది. చెఱకు పైన వున్న ధుమ్ము, ధూలిని శుభ్రం చేయడం, అక్కడక్కడా చెఱకుపైన వున్న చిన్న చిన్న పిలకలను కత్తిరించడం లాంటి వాటి వల్ల చాలా సమయం వృధా అవుతోంది. ఇందు కొరకు వందలాది కూలీల కొరకు లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తోందన్నాడు వీరారెడ్డి. ఈ సమస్య పరిష్కారానికి కూడా తాను యంత్రం తయారు చేసి ఇస్తానని అంటున్నాడు అల్లాడి ప్రభాకర్.

ఈ చెఱకు కత్తిరించే యంత్రాన్ని రైతులు మరో విధంగా కూడా ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా చెఱకును దాదాపు ఒక అడుగు ముక్క వరకు కత్తిరించి నాటుకుంటూ ఉంటారు. కానీ, చెఱకులో కేవలం కణుపు వద్ద మాత్రమే మొలకలు వస్తాయి. మిగతా భాగమంతా వృధాగా మట్టిలో కలిసి పోతుంది. కాబట్టి రైతులు కేవలం చెఱకు కణుపులను మాత్రవే కత్తిరించుకుని, మిగతా భాగాన్ని రసానికి ఉపయోగించుకోవటం ద్వారా అదనంగా బెల్లం తయారీకి చెఱుకు లభించినట్లవుతుంది.

ప్రస్తుతం వీరారెడ్డి చెఱుకును చిన్న చిన్న ముక్కలుగా చేసి, వాటి పైన వున్న ఈనెలను తొలగించి, అన్ని రకాల శుభ కార్యాలలో భోజనానికి ముందు, భోజనం తర్వాత నోరు తీపి చేసుకునేందుకు ఆ ముక్కలను అందించడం ద్వారా ఒక కొత్త ఒరవడికి రూపు దిద్దుతున్నాడు అందుకు అనుగుణంగా ఆ చెఱకు ఈనెలను కత్తిరించేందుకు కూడా



ఏదైనా పరిష్కారం చూపమని ప్రభాకర్‌ను కోరటం జరిగింది.

మొత్తానికి వీరారెడ్డి ఈ యంత్రం కొనుగోలు పట్ల తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, 'పల్లెసృజన' వల్ల తనకు అవసరమైన యంత్రాన్ని తయారు చేయగల ఇన్నోవేటర్ లభించడం పట్ల తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ యంత్రం వల్ల తనకు 5 విధాలుగా లాభం చేకూరుతుందని అన్నారు. తనకు చేకూరుతున్న లాభాలు ... 1. చెఱుకు కత్తిరించటానికి ఎక్కువ ఖర్చుతో లభించే బలమైన మగ కూలీల అవసరం లేకుండా, తక్కువ ఖర్చుతో, ఎటువంటి శిక్షణ అవసరం లేని సాధారణ మహిళా కూలీలతో ఈ పని చేయిస్తున్నాను. 2. అనవసరమైన చెఱకు భాగాన్ని తీసివేయటం వల్ల నాణ్యమైన చెఱకు ముక్కలను రసం తయారీకి పంపడం. 3. చెఱకు ముక్క చేతితో కత్తిరిస్తే చాలా వరకు చిట్లిపోవటం వల్ల రసం నేలపాలు అవుతుండేది. ఈ యంత్రం వల్ల అటువంటి నష్టాలు జరగకుండా చాలా పదునుగా ముక్కను కత్తిరిస్తుంది కాబట్టి రసం వల్ల జరిగే నష్టాలు 90 శాతం తగ్గాయి. 4. మనుషుల ద్వారా కత్తిరించటం వల్ల చాలా సమయం పట్టేది. ఈ యంత్రం వల్ల పని చాలా త్వరగా అవుతోంది. 5. చెఱుకు ముక్కలన్నీ కూడా ఒక ప్రామాణిత కొలతతో ఉండటం వల్ల రవాణాలో ఎక్కువ చెఱుకు ముక్కలను రసం తీసే కేంద్రాలకు పంపడం జరుగుతోంది.

పల్లెసృజన ప్రారంభించిన 'మీ సమస్య – మా పరిష్కారం' నేపథ్యంలో సాధ్యమైన ఈ విజయవంతమైన ప్రయోగం రైతుకు లాభసాటిగా, చెఱకు రసాలు అమ్మే వారికి తోడుగా, వారి ఆదాయం పెంచేట్టుగా, ప్రజలకు చెఱకు రసం, చెఱకు ముక్కలు సులభంగా అందించేలా సాధ్యమైంది. దీనికి కారణమైన ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్ గారికి 'పల్లెసృజన' అభినందనలు. సమస్య ఎంత జఠిలమైనా, పరిష్కారం లభిస్తాయన్న ఆశాకిరణం ఈ కథలో విదితమైంది.

**ఇన్నోవేటర్ అల్లాడి ప్రభాకర్, ఫోన్ : 9440037475**

**రైతు వీరారెడ్డి, రావులపాలెం, ఫోన్ : 9533361515**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India

## జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు** గొప్ప ఇన్నోవేటర్‌కు **లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు ప్రోత్సాహక **బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ** వర్గాలలో ఎన్నుకోబడిన **ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు,** పర్యావరణానికి **తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

## దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-40253096)** సంప్రదించండి.

# ఎన్.ఐ.ఎఫ్. వారి ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూయర్‌షిప్ (ఫైన్ - 2023) పురస్కారాలు




**ఎన్.ఐ.ఎఫ్. వారి జాతీయ ద్వైవార్షిక పునాది స్థాయి ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విజేతలకు భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి ముర్ము, న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 10 నుండి 13, 2023 వరకు రాష్ట్రపతి భవన్ లోనే జరిగిన "ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ & ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఫైన్ – 2023)" ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అందులో బహుమతులు పొందిన అనేక మంది ఇన్నోవేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కొందరి వివరాలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.**

## పశువులలో 'పొదుగు వాపు వ్యాధి' నివారణకు మూలికా వైద్యం :



రాష్ట్రస్థాయి పురస్కారం

**విష్ణుకుమార్ శర్మ** (50), జైపూర్, రాజస్థాన్.

సాధారణంగా పశువులలో పొదుగు వాపు వ్యాధి వచ్చినపుడు ఖరీదైన రక రకాల మందులను ఉపయోగిస్తుంటారు లేదా అంత ఖర్చు పెట్టుకోలేని వారు నొప్పితో బాధ పడతున్నా, అదే తగ్గిపోతుందిలే అని వదిలేస్తారు. మొదటి పద్ధతిలో పశువులు ఆధునిక వైద్యానికి అలవాటు పడిపోయి, ఇక ఏమందులూ పని చెయ్యని పరిస్థితి వస్తుంది. రెండో పద్ధతిలో పశువుని హింసించిన వారవుతారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కి చెందిన విష్ణుకుమార్, అతని భార్య సుభద్ర కలిసి ఉష్ణ మండలానికి సరిపోయే విధంగా తమ పశువులు పొదుగు వాపు వ్యాధి బారిన పడినప్పుడు ఉపయోగించటానికి ఒక లేపనం తయారు చేశారు. యాంటీబయాటిక్స్ వాడటం వలన కలిగే దుష్పరిణామాలు తెలిసిన వారు అవటం చేత, స్థానికంగా దొరికే 'విషాణ్యం' అనే ఆకుని వేడి చేసి, దానిలో కొబ్బరి నూనెని కలిపి పశువు పొదుగుకు రాస్తారు. దానితో పశువుకు నొప్పి తగ్గి త్వరలో గుణం కనిపిస్తుంది.

విష్ణుకుమార్ తన తల్లి దండ్రులని ప్రాణాంతక వ్యాధుల కారణంగా కోల్పోయాడు. అప్పటి నుంచి తను మనుష్యులకి, పశువులకి జబ్బులు నయం చేయాలనే సంకల్పంతో బ్రతుకుతున్నాడు. నాకేం పెద్ద కోరికలు లేవు, నేను కేవలం మన దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను. మన దేశంలో అపారమైన జ్ఞానం ఉన్నా దానిని వాడుకోవటం లేదు. అది కనుమరుగై పోతోంది. దానిని కాపాడి, నలుగురికీ సేవ చేయాలనేదే నా సంకల్పం అంటాడు విష్ణుకుమార్.

ఆ సంకల్పం తోనే వరసగా ఇన్నోవేషన్‌లు చేయటం మొదలు పెట్టాడు. ఇప్పటి వరకు 32 ఇన్నోవేషన్‌లు చేశాడు. అందులో 26 మూలికా ద్రవ్యానికి సంబంధించినవే ఉన్నాయి. పూర్వం ఎయిర్ కూలింగ్ సిస్టమ్‌ను కనిపెట్టగా దానిని ఎన్ఐఎఫ్ వారి సహాయంతో పేటెంట్ కూడా పొందాడు. ప్రస్తుతం అతి చవకగా 7 నిమిషాలలో చల్లపరిచే రిఫ్రిజిరేటర్ తయారు చేసే పనిలో ఉన్నాడు.

ఇన్ని ఇన్నోవేషన్లు చేసి, ఎంతోమంది ప్రజలకి సహాయం చేసి, ఇదంతా మన దేశ సౌభాగ్యం కోసమేనని చెపుకొంటున్న విష్ణుకుమార్ శర్మకి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. తృతీయ బహుమతిని ఇచ్చి సత్కరించారు.

## కొత్తరకం చేతి మగ్గం



రాష్ట్ర స్థాయి పురస్కారం

**వి. కారప్పన్** (71), కోయంబత్తూరు, తమిళనాడు.

చేతి మగ్గాలు కొన్ని దశాబ్దాల నుంచీ వాడుతునే ఉన్నాం. సాంప్రదాయ మగ్గాలతో నేయాలంటే చాలా శక్తి, బలం కావాల్సి ఉంటుంది. కనుక వయస్సు మళ్ళిన వారు దానిపై పని చెయ్యటం అంత సులభమైన పని కాదు. చిన్న పిల్లలు, ముసలివారు, మహిళలు కూడా సునాయాసంగా నేయటానికి అనువుగా ఉండేలా సాంప్రదాయ మగ్గానికి కొన్ని మార్పులు చేసి, అందరికీ అనువుగా ఉండేలా మగ్గాన్ని రూపొందించాడు తమిళనాడు లోని కోయంబత్తూ రుకు చెందిన వి. కారప్పన్. దీనిని ఎక్కువ బలం వాడకుండానే కాలుతో అదీ ఒక్క కాలితో తొక్కి పని చేయించవచ్చు. మగ్గానికి ఉన్న ఫ్రేము తొక్కుతూ బరువు ఒక పెడల్ సహాయంతో అటు ఇటు వెళ్ళేలా చేస్తుంది. తద్వారా బట్టలు నేయటం సులభం అవుతుంది. ఈ మగ్గంపై నేసిన బట్టలు త్వరగా, ఎక్కువ శ్రమ లేకుండా నాణ్యత కలిగి ఎక్కువ ధరకు అమ్ముడు పోతున్నాయి. ఇదివరకు సాధారణ మగ్గాలపై 18 గంటలు చేసే పని, ఈ మార్పు చేసిన మగ్గంపై కేవలం 8 గంటల లోపే చెయ్యవచ్చు. ఆరు మీటర్ల కాంచీపురం చీర కేవలం 12 గంటల్లో నేయవచ్చు అంటున్నాడు కారెప్పన్. ఈ మగ్గం ఎలా పని చేస్తుందో చూపుతూ దీనిపైన మహిళలు, పిల్లలు, వయసు పైబడిన వాళ్ళు, దివ్యాంగులు కూడా సులభంగా పని చేయవచ్చునని అంటాడు అతను. దీనిపైన ఏ రకమైన నూలైనా, ఏ రకమైన బట్టనైనా చీరలు, దుప్పట్లు, మొదలైనవి ఏవైనా నేసుకోవచ్చు. దీనికి తను 2014 నుంచి మార్పులు చేర్పులు చేస్తూనే ఉన్నాడు. దీనిని ఇంకా మెరుగు పరిచే అవకాశం ఉంది అంటాడాయన. ఇదే కాక అతను ఎన్నో రకాల మగ్గాలు వాటికి సంబంధించిన ఇతర ఉపకరణాలు రూపొందించాడు.

మహిళలు, పిల్లలు, వయసులో పెద్దవారు కూడా సునాయాసంగా ఉపయోగించటానికి వీలైన మగ్గాన్ని రూపొందించినందుకు గాను కారప్పన్‌కి ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.



## లవంగాలలో మొగ్గను వేరు చేసే పరికరం



రాష్ట్ర స్థాయి పురస్కారం

**షైనీ జోసెఫ్** (40), కోజీకోడ్, కేరళ.

చేతితో లవంగ మొగ్గలను తుంచి వేరు చెయ్యాలంటే చాలా సమయం పడుతుంది. అంతే కాకుండా లవంగాలు చెడి పోయి, ముక్కలు అయి పోయి, నాణ్యత తగ్గటంతో పాటు మార్కెట్లో సరియైన ధర కూడా లభించదు. అదీ కాక ఒక వ్యక్తి రోజుకు 15 కిలోల లవంగాలు మాత్రమే తుంచగలడు. అతనికి కిలోకు రూ. 30లు చెల్లించాల్సి ఉంటుంది. (రోజుకు రూ. 450/–). షైనీ జోసెఫ్ మరియు అతని తోటి వ్యవసాయ దారులు లవంగాల సాగు ఖర్చులు పెరగటంతో మానేశారు. 3 తరాలుగా వంశ పారంపర్యంగా చేస్తున్న లవంగ వ్యవసాయం మానటం ఇష్టం లేని జోసఫ్ లవంగాలని తుంచటానికి ఒక యంత్రం కనిపెట్టాలి అనుకున్నాడు. 2018లో చాలా శ్రమపడి సమర్థవంతంగా పని చేసే ఒక యంత్రాన్ని కనిపెట్టాడు. ఈ యంత్రానికి అతడు లవంగాలు వేరు చెయ్యటానికి గుండ్రని బ్లేడ్లు, గాలికై ఫ్యాను, 1 హార్స్‌పవర్ మోటారులను ఉపయోగించాడు. ఈ యంత్రం రాపిడి పద్ధతిలో పని చేస్తుంది. లవంగాలను వేరు చేస్తుంది. ఒక నెలలో చేసే పనిని ఈ యంత్రం సహాయంతో ఒకే ఒక్క రోజులో అది కూడా కేవలం 10వ వంతు ఖర్చుతో పూర్తి చెయ్యవచ్చు. దీనితో దాదాపు 400 కిలోల లవంగాలు కేవలం ఒక గంటలో చేసి పెడుతుంది. ఈ పనికి ఇదివరకు 30 మంది పనివారు అవసరం అయ్యేవారు. రూ. 40,000 ఖరీదు చేసే ఈ యంత్రం 99% ఖచ్చితత్వంతో పని చేస్తుంది. దీని తరువాత నిలువ ఉండటానికి లవంగాలని ఉప్పు నీటితో శుభ్ర పరచడం సులభం అవుతుంది.

లవంగాలను తయారు చెయ్యడంలో ఎంతో ఖర్చు తగ్గించే ఈ యంత్రాన్ని రూపొందించిన షైనీ జోషఫ్‌కు ఎన్ఐఎఫ్ వారు ఢిల్లీలో నిర్వహించిన తమ 11వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో 2023వ సం. రాష్ట్ర స్థాయి బహుమతి ఇచ్చి సత్కరించారు.



(వచ్చే సంచికలో మరి కొన్ని పురస్కారాలు)

# ఆయుర్వేద జ్ఞాన మథనం



ఉమా మహేశ్వర రావు

## పెరుగుతున్న 'గుండె పోటు' వ్యాధుల నియంత్రణకు చిట్కాలు

ఇటీవలి కాలంలో వయసుతో నిమిత్తం లేకుండా 'గుండె పోటు' వ్యాధులు ప్రబలి పోతున్నాయి. ఇలా కావటానికి కారణాలు అధిక వత్తిడికి గురి కావటం, అధిక మందుల వాడకం, నిద్ర లేమి, సమయాని కి భోజనం చేయక పోవటం, రసాయణాలతో కూడిన ఆహార పదార్థాలు, పొగ త్రాగటం, ఇతరులు త్రాగే పొగను పీల్చటం లాంటివి కొన్ని. పూర్వం గుండెపోటు వచ్చింది అంటే వారు అధిక వత్తిడికి గురి కావటం అనే వారు. ప్రస్తుతం వయసుతో సబంధం లేకుండా ఏ దురలవాట్లు లేని వాళ్ళకు కూడా గుండెపోటు రావటం చాలా పెరిగి పోయింది.

గుండె పోటు వచ్చే ముందు మనిషికి కలిగే కొన్ని లక్షణాలను గుర్తించక పోవటం వల్ల ఆ వ్యక్తిని ఆసుపత్రికి తీసుకు వెళ్ళేందుకు కొంత దూరం నడిపించుకుంటూ వెళ్ళటం వల్ల అధిక మరణాలు సంభవిస్తున్నాయి. గుండెపోటు వచ్చేస్తుంది అనటాకి కొన్ని లక్షణాలు 'వత్తిడికి గురి కావటం, చికాకు అనిపించటం, గుండెలో నొప్పిగా అనిపించటం, మెడ దగ్గర, రెండు భుజాల వద్ద గల వెన్నుపోసలో నొప్పి రావటం, గాలి పీల్చటం కష్టం అనిపించటం, వాంతికి వచ్చినట్లు అనిపించటం, దవడ బాగా నొప్పిగా ఉండటం' లాంటి కొన్ని సూచనలు ఆడవాళ్ళకైనా మగవాళ్ళకైనా వచ్చినపుడు ఆసుపత్రికి తీసుకు వెళ్ళేందుకు తగిన వాహనం వద్దకు వారిని నడిపించుకుంటూ తెసుకు వెళ్ళరాదు. వీలైతే వారిని ఎత్తుకుని వెళ్ళటం, లేదా ఒక కుర్చీలో కూర్చోబెట్టి ఆ కుర్చీని మోసుకు వెళ్ళటం లాంటి చేయాలే తప్ప వారిని నడిపించుకుంటూ తీసుకు వెళ్ళే గుండెనొప్పి ఇంకా ఎక్కువై వారు ఆసుపత్రికి వెళ్ళే లోపే మరణించే అవకాశాలు ఉంటాయి.

కొందరు రెండు కళ్ళతో ఎదుటి వారిని చూడలేక ఒక కన్నుతో చూడటం కూడా ఒక లక్షణమే. నడిపించుకుంటూ వెళ్ళేటపుడు రెండు అడుగులు వెయ్యగానే బాగా తలనొప్పి వచ్చినట్లు అవుతుంది. ఈ లక్షణాలు రోగిలో కనిపించినట్లయితే వాళ్ళను నడిపించకుండా తీసుకు వెళ్ళటం చాలా మంచిది.


నివారణ మార్గాల్లో కొన్ని 'ఎక్కువ వత్తిడికి గురవుతున్న వారు పండ్లు, పండ్ల రసాలు బాగా తీసుకోవటం'. వీలైనప్పుడల్లా బూడిద గుమ్మడికాయ రసం త్రాగటం, ఇటువంటి సమయాల్లో కొందరికి అదేపనిగా త్రేపుల రూపంలో గ్యాస్ వస్తూ ఉంటుంది. అటువంటి వారు ఏ పనీ చెయ్యకుండా, వీలైనంత వరకు విశ్రాంతి తీసుకుంటూ ఉండాలి. వెన్న, మీగడ, మాంసాహారం, కాఫీ లాంటి అలవాట్లకు వీలైనంత దూరంగా ఉండాలి. రోజుకు కనీసం ఒక్కటైనా టమోట పండును తింటూ ఉన్నట్లయితే గుండెపోటు నుంచి బయట పడే అవకాశాలు ఎక్కువ. గంజాయి, సిగరెట్లు త్రాగేవారు వాటిని మానేస్తే తప్ప బయట పడటం కష్టం. గుండెపోటుకు సంబంధించిన మాత్రలు వేసుకుంటూ ఉన్నవారైనా సరే రోజూ తప్పకుండా తమ ఆహారంలో వెల్లుల్లి తీసుకుంటూ ఉండటం చాలా మంచిది. వీలైతే రోజూ ఒక వెల్లుల్లి రెబ్బను పరగడుపున నోట్లో వేసుకుని నమిలి తినటం చాలా ఉత్తమం. ఒకసారి గుండెనొప్పి వచ్చిన వారు ఈ జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటే మళ్ళీ మళ్ళీ గుండెనొప్పి వచ్చే ఆవకాశాలు చాలా తక్కువ.


ఇటువంటి వ్యక్తులు రోజుకు కనీసం 6 గంటల పాటు తప్పకుండా నిద్రపోతూ ఉండాలి. ఎంతో కష్టపడి వ్యాయామాలు చేయాల్సిన అవసరం లేదు. రోజు ఉదయం, సాయంకాలం మూడు నాలుగు సార్లు గుంజిళ్ళు తీస్తూ ఉంటే చాలు ఎక్కువ వ్యాయామం చెయ్యాల్సిన అవసరం లేదు. షడ్రుచులతో కూడిన భోజనం అంటే తీపి, చేదు, కారం, వగరు, పులుపులతో కూడిన భోజనం ఉదయం లేదా సాయంత్రం లో ఉండేటట్టు చూసుకోవటం మంచిది. బాగా కాఫీ త్రాగే అలవాటు ఉన్నవారు, కాఫీ మానేసి టీ త్రాగటం అలవాటు చేసుకోవటం మంచిది. ఎందుకంటే కాఫీలో చికోరి కలిసి ఉంటుంది. అంటే పొగ త్రాగే వారికి కలిగే నష్టాలు ఈ కాఫీలో కూడా ఉంటాయి. టీత్రాగటం వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు తక్కువ.

తప్పనిసరి శ్రమతో కూడిన పని చెయ్యాల్సి వచ్చినపుడు ఆ పని ఎలాగైనా పూర్తి చెయ్యాలి అని కష్టపడి పని చేసి వచ్చి వత్తిడికి గురి కావటం కన్నా, వీలైనంత వరకు పనిని వాయిదా వేసుకుంటూ నిదానంగా చేసుకోవటం మంచిది. వత్తిడి ఎక్కువగా ఉంది అనిపించినపుడు ఎదుటి వారితో ఒక 10 నిమిషాలు మాట్లాడటం వల్ల వత్తిడి కొద్దగా తగ్గే అవకాశం ఉంటుంది. హార్ట్ అటాక్ ఉన్న వారికి కొద్దిగా కోపం ఎక్కువగా వస్తూ ఉంటుంది. కాబట్టి వీలైనంత వరకు ధ్యానం ద్వారా కోపం తగ్గేలా చూసుకోవట మంచిది. ఆయాసం ఎక్కువ అవుతున్నపుడు కొద్దిసేపు కూర్చొని విశ్రాంతి తీసుకుని, ఆయాసం తగ్గిన తర్వాత పనులను చేసుకోవటం మంచిది. ఈ లక్షణాలు కనిపించినపుడు వీలైనంత వరకు నడవకుండా ఉండే హార్ట్ అటాక్ నుంచి బైట పడే అవకాశాలు ఎక్కువ.

ఈ లక్షణాలు ఉన్నవారు తప్పక గమనించాల్సిన విషయాలు వెల్లుల్లి తీసుకోవటం, పండ్ల రసాలు తీసుకోవటం, తృణ ధాన్యాలతో కూడిన జావ (కొర్ర, అండుకొర్ర, ఊదలు, అరికలు, బరిగలు, సజ్జలాంటి)ను తీసుకుంటూ ఉండటం తప్పక ఆచరించాల్సిన అవసరం ఉంది. డాక్టర్లు చెప్పిన మందులను ఉపయోగించటంతో పాటు వీటిని తీసుకోవటం వల్ల గుండెనొప్పి నుండి బయట పడవచ్చు.

10 Common Symptoms of a Heart Attack



**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# చలికాలంలో వచ్చే అనారోగ్యాలకు వైద్య చిట్కాలు


'వైద్య' కొమెర జాజి

చలికాలం రాబోతోంది. ఇప్పటికే చలి బాగా మొదలైందన్న విషయం అందరికీ తెలిసిందే. చలికాలంలో కొందరు అనారోగ్యాల బారిన పడుతూ ఉంటారు. అటువంటి వాటిలో అతిమూత్ర వ్యాధి ఒకటి. చలికి తట్టుకోలేక కొందరు ఎన్నోసార్లు మూత్ర విసర్జన చేస్తూ ఉంటారు. అటువంటి వారు కొన్ని వైద్య చిట్కాలు పాటిస్తే ఈ వ్యాధి నుండి కొంత వరకు ఉపశమనం పొందవచ్చు.

'సబ్జా గింజలు' మార్కెట్లోని కిరాణా దుకాణాలు, ఆయుర్వేద దుకాణాల్లో లభిస్తాయి. వీటిని తెచ్చుకొని ఒక గ్లాసు నీటిలో ఒకటి రెండు స్పూన్ల గింజలను పావు గంటసేపు నానబెట్టాలి. లేదా రాత్రి నీళ్ళలో వేసి ఉంచినా ఫర్వాలేదు. ఈ నీటిని ఉదయమే పరగడుపున ఒక గ్లాసు, సాయంత్రం సూర్యాస్తమయం అయిన తర్వాత ఒక గ్లాసు సబ్జా గింజల నీటిని తీసుకుంటూ ఉన్నట్లయితే అతిమూత్ర వ్యాధి తగ్గిపోతుంది.

'కొబ్బరి పువ్వు' కూడా ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తోంది. కొబ్బరి కాయ లోపల గుండ్రంగా పువ్వు ఏర్పడుతూ ఉంటుంది. ఆ పువ్వును తెచ్చుకొని, దాన్ని చిన్న చిన్న ముక్కలుగా చేసి, ఆ ముక్కలను పెరుగులో కలిపి కొద్దిసేపు నానబెట్టిన తర్వాత ఆ పెరుగును తీసుకుంటే అతిమూత్రం వ్యాధి చాలా వరకు తగ్గిపోతుంది.

కానుగ చెట్లు ఈ చలికాలం బాగా పూతకు వస్తాయి. ఆ పువ్వులను తీసుకు వచ్చి, నీడలో బాగా ఆరనిచ్చిన తర్వాత వాటిని పొడి చేసి పెట్టుకోవాలి. ఆ పొడిలో 'పటిక బెల్లం' తగినంత కలుపుకుని రోజూ ఒకటి రెండు స్పూన్ల పొడిని నోట్లో వేసుకుంటూ ఉన్నట్లయితే కూడా అతిమూత్ర వ్యాధి తగ్గుముఖం పడుతుంది.

'దుసర తీగ' ఈ కాలంలో ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద తీగలుగా వేసి పచ్చదనంతో ఆ ప్రాంతాన్ని నింపుతూ ఉంటాయి. దీన్నే 'పాతాళ గరుడ' అని కూడా అంటారు. వీటి ఆకులను తెచ్చుకొని, వాటిని రోట్లో వేసి బాగా నూరిన తర్వాత ఆ ముద్దను ఒక గ్లాసు నీటిలో వేసి బాగా కలిపి, అందులోనే ఆయుర్వేద షాపుల్లో లభించే 'సాంబ్రాణి చూర్ణం' తెచ్చుకొని అందులో కొద్దిగా వేసి, ఆ నీటిని సగం గ్లాసు అయ్యే వరకు పొయ్యిమీద పెట్టి మరిగించాలి. సగం గ్లాసు అయిన తర్వాత వాటిని ప్రక్కన పెట్టి అవి చల్లారిన తర్వాత ఒక గుడ్డలో వేస వడకట్టుకుని ఈ కషాయాన్ని తీసుకున్నట్లయితే కూడా అతిమూత్రం వ్యాధి తగ్గిపోతుంది.





'కసివింద' అనే చెట్లు మనకు రోడ్లవెంట కనిపిస్తూ ఉంటాయి. వీటి కాయలు చిక్కుడు కాయల్లాగా ఉంటాయి వాటిని తెచ్చుకుని, వాటి విత్తనాలను వలిచి పెట్టుకోవాలి. అలాగే దేశీ కాకర కాయ విత్తనాలను కూడా సేకరించుకుని ఈ రెండింటిని కలిపి మెత్తగా దంచి అందులో కొద్దిగా పాలను వేసి బాగా నూరి ఆ పాలను తీసుకున్నట్ల యితే కూడా అతిమూత్ర వ్యాధి తగ్గి పోతుంది. లేదా ఆ విత్తనాలను నీడన ఆరబెట్టి, పొడి చేసి పెట్టుకుని, గ్లాసు పాలలో ఒక చెంచాడ పొడిని వేసుకుని కలుపుకుని కూడా త్రాగవచ్చు.

మూత్రంలో కొందరికి సుద్దరోగం అని వస్తుంది. అంటే పురుషాంగం మొదలులో చర్మం క్రింద కంటి పుసుల లాగా తెల్లని పదార్థం ఏర్పడుతూ ఉంటుంది. ఇది కొందరికి దుర్వాసనతో కూడి కూడా ఉంటుంది. ఈ సమస్యకి పరిష్కారంగా మిరియాలు పెనంపైన వేసి దోరగా వేయించిన తర్వాత వాటిని పొడిగా చేసుకుని ఉంచుకోవాలి. ఆ తర్వాత రోజుకు రెండుసార్లు చొప్పున ఒక గ్లాసు వేడి నీటిలో ఒక చెంచాడు మిరియాల పొడిని కలుపుకుని త్రాగుతూ ఉన్నట్లయితే ఈ సుద్ద రోగం నయమౌతుంది.

ఈ మూత్ర సుద్ద రోగానికి మరో చిట్కా ఏమిటంటే, వేడిగా ఉన్న అన్నం గంజిలో ఒక చెంచాడు శుద్ధమైన ఆవు నెయ్యి కలుపుకుని, రోజూ ఉదయం, సాయంత్రం టీలాగా త్రాగుతూ ఉన్నట్లయితే కూడా ఈ మూత్రసుద్ద రోగం నయమౌతుంది.

**గుండె దడ నివారణకు ఆయుర్వేద చిట్కాలు:**

కొందరికి నరాల బలహీనత వల్ల, మానసిక ఒత్తిడి వల్ల గుండె దడ వస్తూ ఉంటుంది. బలం తక్కువగా ఉన్నవారికి, గ్యాస్ట్రిక్ ట్రబుల్ ఉన్న వారికి కూడా ఈ గుండెదడ వస్తూ ఉంటుంది. ఈ వ్యాధి నివారణకు సంపంగి పూలను తీసుకుని, రోట్లో వేసి బాగా దంచుకుని, అందులో తేనె కలుపుకుని నోట్లో వేసుకుంటూ ఉన్నట్లయితే గుండెదడ చాలా వరకు తగ్గిపోతుంది. అంతే కాదు గుండెకు బలం కూడా చేకూరు తుంది.

అలాగే ఈ కాలంలో లభించే 'రావి పండ్ల'ను సేకరించి, వాటిని నీడలో బాగా ఆరనిచ్చిన అవి ఒట్టిగా అయిన తర్వాత వాటిని మెత్తగా పొడి (చూర్ణం) చేసి ఉంచుకోవాలి. ఈ పొడిని ప్రతిరోజు రెండు సార్లు చొప్పున ఒక గ్లాసు ఆవు పాలలో ఒక చెంచాడు కలుపుకని త్రాగుతూ ఉన్నా కూడా గుండెదడ తగ్గిపోతుంది.

ఈ గుండె దడ నివారణక మరో సూక్ష్మమైన చిట్కా ఏమిటంటే మంచి తేనెలో బెల్లం ముక్కను అద్దుకొని తింటూ ఉన్నా కూడా గుండెదడ బాగా తగ్గిపోతుంది. అలాగే గుండెదడ ఎక్కువగా ఉన్నవారు రావి చెట్టు క్రింద ఎక్కువసేపు గడుపుతూ, రావిచెట్టు క్రింద కొద్దిసేపు నీరు ఉంచి, లేదా ఆ చెట్టుక్రింద ఉన్న బోరు బావిలోని నీరు త్రాగుతూ ఉన్నా కూడా గుండెదడ చాలా వరకు తగ్గిపోతుంది.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

## స్పందన

**శ్రీ గణేశం గారూ,**

నమస్తే, సెప్టెంబర్ – అక్టోబర్ 24 పల్లెసృజన పత్రిక ఈరోజే అందినది. వినూత్న విశేషణ, సృజనాత్మకతలతో మీ ఆధ్వర్యంలో ప్రయాణం చేయుచున్న వివరములు ఆశ్చర్యంగా ఆనందంగా ఉన్నాయి. నిస్వార్థమైన మీ అమూల్య సేవలు ఎంతోమందికి ప్రేరణ కలిగించి, పల్లె ప్రజలకు ఇతోధికంగా ఉపయోగ పడుతున్నాయి. ఈ మీ ప్రయాణము దిగ్విజయంగా సాగాలని మీ పత్రిక సహస్ర పత్రికగా రూపొందాలని ఆశిస్తూ..... **– సి.వి.ఆర్. శెట్టి**, అనంతపురం జిల్లా.

**'పల్లెసృజన' యాజమాన్యం వారికి నమస్కారములు,**

మీకు హృదయపూర్వక అభినందనలు. మన 'పల్లెసృజన' 100వ పత్రికను ఈరోజే అందుకున్నాను. నాకు చాలా ఆనందం కలిగించింది. మన పల్లెసృజన పత్రికను గురించి, దాని గొప్పతనాన్ని గురించి మా మిత్రులతో అప్పుడప్పుడూ చెబుతూ ఉంటాను. ఇది గ్రామాల్లోని చాలా మందికి బాగా ఉపయోగ పడుతుంది. ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్నటువంటి వరి చెత్తతో తయారు చేసిన చీరలు, చెర్నాకోల లాంటి ఎన్నో రకాల వస్తువులను తయారు చేసిన మువ్వా కృష్ణమూర్తి లాంటి వారిని వారి వస్తువులను భారత రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి గారి ముందు ప్రదర్శించే అవకాశం కల్పించారు. రాష్ట్రపతి గారు కూడా వారిని అభినందించడం జరిగింది. మారుమూల గ్రామంలో ఉన్నటువంటి పనితనాన్ని రాష్ట్రపతి భవనంలో ప్రదర్శించడం జరిగింది అంటే అది కేవలం పల్లెసృజన వల్లే జరిగిందని చెబుతున్నాను. మువ్వా కృష్ణమూర్తి గారు కూడా నాతో మాట్లాడుతూ నేను ఈ వరి చెత్తతో వస్తువులు తయారు చేస్తూ ఉంటే నన్ను ఊర్లో అందరూ ఒక పిచ్చోడిలాగా చూసే వారు. అలాంటిది నా పనితనాన్ని గుర్తించిన పల్లెసృజన నన్ను రాష్ట్రపతి భవనం దాకా తీసుకు వెళ్ళారు. ఊర్లో వారితో నేను రాష్ట్రపతి భవనానికి వెళ్ళి వచ్చాను, నేను తయారు చేసిన శాలువాను రాష్ట్రపతి గారికి బహుమతిగా ఇచ్చాను అన్నపుడు నా పనితనాన్ని గుర్తించి అప్పుడు నన్ను మా గ్రామంలో సన్మానించడం జరిగింది అని ఆనందంగా చెబుతూ ఉంటారు. ఈ పత్రిక ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుగు సాగాలని అందరికీ పత్రిక యాజమాన్య సభ్యులందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. **– భవనం వెంకట్రామి రెడ్డి**, 75 తాళ్ళూరు, గుంటూరు జిల్లా.

**వీరరాఘవ రెడ్డి గారికి,**

పల్లెసృజన పత్రిక అందింది. ఈ పత్రికలో 'శత ప్రతుల పల్లెసృజన' వ్యాసం చదువుతుంటే నాకెంతో ఆనందంతో పాటు ఆశ్చర్యం కూడా వేసింది. మారుమూల గ్రామాల్లోని ఇన్నోవేషన్లను ప్రపంచానికి చాటడానికి మీరు పడుతున్న శ్రమకు మీకు చేతులు జోడిస్తున్నాను. మీరు వ్రాస్తున్న కథనాలు సామాన్య రైతుకు అర్థమయ్యే భాషలో ఎటువంటి అనుమానం లేకుండా రైతుకు అర్థం అయ్యేలా ఉన్నాయి. ఇంత గొప్ప పత్రికను ఇప్పటి వరకు నేనెప్పుడూ చూడలేదు అంటే అతిశయోక్తి కాదేమో. ఈ పత్రికను అనంతపురం జిల్లాలోని మా మిత్రుడైన ఒక న్యాయవాదికి చూపించగా, అతను కూడా ఇంత మంచి పత్రిక 100 సంచికలు అయ్యేదాకా మనకు తెలియలేదంటే ఆశ్చర్యం వేస్తుంది అన్నారు. పదవ తరగతి కూడా చదవని ఎందరో ఇన్నోవేటర్లను రాష్ట్రం, దేశంలో మాత్రమే కాకుండా, విదేశాలకు సైతం చేరవేస్తున్న మీ కృషికి అభినందించకుండా ఉండలేక ఈ వ్యాసం చదివిన వెంటనే మీకు ఫోన్ చేస్తున్నాను. ఇక ఆముదపు పంటను గురించి నేను చేసిన కొంత సమాచారాన్ని మాత్రమే ఒక లేఖ ద్వారా తెలియజేస్తే, దాన్ని చూసి, నాకు ఫోన్ చేసి వివరాలు కనుక్కొని, దాన్ని ఇంకా బాగా విపులీకరించి అతి సామాన్య రైతుకు కూడా చేరేలా వ్రాసిన మీ జ్ఞానానికి కృతజ్ఞతలు. నేను కొన్ని విషయాలు మాత్రమే మీతో చెప్పాను, కానీ నా మనసులోని భావాలు మొత్తం రైతాంగానికి తెలియజేయటం చాలా గొప్ప విషయం. మిమ్మల్ని గురించి, టీవీలో ఒక కార్యక్రమం చూసి, ఆ టీవీ వాళ్ళను అడిగి మీ వివరాలు తెలుసుకుని ఉత్తరం వ్రాస్తే, ఒక మారుమూల గ్రామంలో ఉండే నా పనిని ప్రపంచానికి చాటారు, మీ 100 సంచికల వ్యాసం చదివిన తర్వాత మిమ్మల్ని, మీ కార్యాలయాన్ని తప్పక సందర్శించాలి అన్న కుతూహలం నాలో పెరిగి పోయింది. అందుకే డిశంబర్ 4–5 తేదీలలో మీ కార్యాలయాన్ని సందర్శించి, మిమ్మల్ని, బ్రిగేడియర్ గణేశం గారిని అభినందించడం కోసమే నేను హైదరాబాద్ వస్తున్నాను. పల్లెసృజన కోసం నేను కూడా నాకు చేతనైన సాంకేతిక సహాయం అందించాలని అనుకుంటున్నాను. నేను చేయగలిగిన పని ఏదైనా ఉంటే తప్పక తెలియజేయండి, నేను ఆ పనిని మీకు చేసి నావంతు పల్లెసృజనకు సహకరించ గలను. పల్లెసృజన సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదములు. **– భీమలింగయ్య**, రిటైర్డ్ ప్రొఫెసర్, హొస్పేట, కర్నాటక.

**పాఠకులందరికీ,**

మా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ సహకారం, సలహాలు, జ్ఞాన చర్చలు పల్లెసృజనకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయని మనసారా ఆశిస్తున్నాము. **– పల్లెసృజన సంపాదకీయ వర్గం.**

## పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు

# కొబ్బరి బోండాంల ష్రెడ్డర్

## ఉపాధితో పాటు ఊరు పరిశుభ్రం



ఇన్నోవేటర్
**అల్లాడి ప్రభాకర్**
జగిత్యాల జిల్లా
తెలంగాణ

1. ఒక కొబ్బరి బోండాం భూమిలో కలిసి పోవటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది.
2. దాని ఉప ఉత్పత్తులతో ఎంతో ఉపయోగం లాభదాయకం.
3. కొబ్బరి బోండాం నుండి లభించే పీచు, కోకోపిత్ వల్ల సమాజానికి ఎన్నో లాభాలు.
4. ఈ యంత్రం తో సులభంగా కొబ్బరి బోండాం నుండి పీచును, కోకోపిత్‌ను వేరు చేయవచ్చు.
5. ఈ యంత్రంలో సింగల్ ఫేస్ మరియు 3 ఫేస్ విద్యుత్‌తో నడిచే 3 హార్స్‌పవర్‌ల మోటారు బిగించబడింది.
6. ఈ యంత్రాన్ని ఉపయోగించడం చాలా సులువు. ఎలాంటి ప్రత్యేకమైన శిక్షణ అవసరం లేదు.
7. ఈ మిషన్ గంటకు సుమారు 200 కొబ్బరి బోండాంలను క్రష్ చేస్తుంది.
8. మీ గ్రామం లేదా పట్టణం శుభ్రంగా ఉండటానికి మీవంతు సహకారం అందించవచ్చు.
9. ఈ యంత్రం ద్వారా చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటు చేసుకొని నలుగురికి ఉపాధి అవకాశం కల్పించవచ్చు.







honeybee.org nifindia.org


వివరాలకు సంప్రదించండి

**పల్లెసృజన**

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
81257 99904, 96528 01700
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org



## పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన గ్రామీణ ఇన్నోవేషన్లు


# వంగిన కరెంటు స్తంభాలను సరిచేసే పరికరం

## శ్రమ,ఖర్చు, సమయం అన్నీ తక్కువే



ఇన్నోవేటర్
**అల్లాడి ప్రభాకర్**
జగిత్యాల జిల్లా
తెలంగాణ

1. ఒకవైపు ఒరిగిపోయిన సిమెంటు కరెంటు స్తంభాలను చక్కగా నిలబెట్టాలంటే ఎంతో శ్రమ, ఖర్చు, సమయం అవసరం.
2. సాధారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 5-6 మంది బలమైన వ్యక్తులు, ఒక ట్రాక్టరు అవసరం. ఒక్క స్తంభం నిలబెట్టడానికి కనీసం 5-6 గంటల సమయం పడుతుంది.
3. ఈ సమస్యకు పరిష్కారంగా కేవలం 1-2 గంటల్లో ఇద్దరు లేదా ముగ్గురు సాధారణ వ్యక్తులు అలుపు లేకుండా స్తంభాన్ని నిటారుగా నిలబెట్టవచ్చు.
4. ట్రాక్టరు అవసరమే లేదు. ఈ పరికరాన్ని కేవలం మోటార్ సైకిల్ పైన ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు.
5. ఈ పనికి అవసరమైన రెండు ప్రత్యేకమైన చిన్న పనిముట్లు కూడా తయారు చేయబడ్డాయి.
6. ఒక్కరోజులో కనీసం 4-5 స్తంభాలను నిటారుగా నిలబెట్టవచ్చు.
7. పంట పొలాల్లో అయినా సరే రైతుకు ఎటువంటి నష్టం వాటిల్ల కుండా పని పూర్తి చేయవచ్చు.
8. విద్యుత్ శాఖకు ఎంతో ఊరట, సమయం, ఖర్చు తక్కువ.
9. విద్యుత్ శాఖకు లక్షలాది రూపాయలను ఆదా చేసే పరికరం.
10. స్తంభాలను త్వరగా సరిచేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.








honeybee.org nifindia.org


వివరాలకు సంప్రదించండి

**పల్లెసృజన**

77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-49253096, 9866 00 1678
E-mail : president@pallesrujana.org
Visit us : www.pallesrujana.org

Marketing by :
**PALLE KISAN**
1-23, Bollavaram, Kallur Mandal, Kurnool Dist. - 518 218, A.P.
Reddy Enclave, Temple Alwal, Secunderabad - 500 010. T.S.
Ph.: 81257 99904 / 79890 38186 Mail : pallekisan.sales@gmail.com


PALLE SRUJANA Telugu Bi-monthly November - December 2024 RNI No. TELTEL/ 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే





























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్: 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

"Phone Pe" no 9866 00 1678

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

**సభ్యత్వ వివరాలు (ఒక సంవత్సరానికి)**

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| మామూలు పోస్టు ద్వారా | 200/- | 1000 |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 320/- | 1120/- |